





# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక — PEN POWER TELUGU DAILY — ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 11 సంచిక : 208 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం శుక్రవారం 4 ఏప్రిల్ 2025 వెల : 5/-రూ॥

VOLUME :11 ISSUE : 208 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM FRI 4 APRIL 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam, Kakinada, Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Prakasam,Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur


## ఇచ్చిన మాట ప్రకారమే పేదలకు

# 'పట్టా'భిషేకం

- పేదలకు ఉచితంగా శాశ్వత గృహ పట్టాలు
- గోవిందు అనే వ్యక్తి కుటుంబానికి స్వయంగా పట్టా అందించిన మంత్రి లోకేశ్
- ముఖ్యమైన హామీని నెరవేర్చడం సంతోషంగా ఉందని వెల్లడి
- మంగళగిరిని టీడీపీ కంచుకోటగా మార్చుతానని స్పష్టీకరణ



పెన్ పవర్ డెస్క్:రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ మంగళగిరి నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. ఉండవల్లిలో దశాబ్దాలుగా ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న పేదలకు ఉచితంగా శాశ్వత గృహ పట్టాలను అందించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా, 15 సంవత్సరాలుగా కొండవాలు ప్రాంతంలో నివసిస్తున్న రాజమండ్రి గోవిందు కుటుంబానికి స్వయంగా వారి ఇంటికి వెళ్లి కొత్త బట్టలు పెట్టి శాశ్వత పట్టాను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం పేదలకు 'పట్టా'భిషేకం చేస్తున్నామని, ముఖ్యమైన హామీని నెరవేర్చడం సంతోషంగా ఉందన్నారు. మంగళగిరి నియోజకవర్గంలో అటవీ, దేవాదాయ, రైల్వే, ఇరిగేషన్ భూముల్లో ఎన్నో ఏళ్లుగా నివసిస్తున్న ప్రజల కష్టాలను చూశానని, వారికి శాశ్వత పట్టాలు ఇవ్వాలని నిర్ణయించానని తెలిపారు.

ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న పేదలకు మూడు విడతలుగా శాశ్వత పట్టాలు ఇవ్వాలని నిర్ణయించామని, మొదటి విడతలో 150 గజాల్లోపు ఉంటున్న 3 వేల మందికి పట్టాలు ఇస్తున్నామని, రెండో విడతలో ఎండోమెంట్స్, రైల్వే భూముల్లో నివసించేవారికి, మూడో విడతలో మిగిలిన వారందరికీ పట్టాలు అందజేస్తామని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు.

2019 ఎన్నికల్లో ఓటమి పాలైనప్పటికీ, మంగళగిరి ప్రజల మనస్సు గెలుచుకోవడానికి గత ఐదేళ్లుగా తన సొంత నిధులతో 26 సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించినట్లు లోకేశ్ తెలిపారు. ఉచిత తాగునీటి ట్యాంకర్లు, గ్రావెల్ రోడ్ల నిర్మాణం, కరోనా సమయంలో ఆక్సిజన్, టెలీ మెడిసిన్ సేవలు, ఎన్టీఆర్ సంజీవని ఆరోగ్య రథాలు, యువత కోసం క్రీడా పోటీలు వంటి కార్యక్రమాలు చేపట్టామన్నారు. ప్రజలు తనపై నమ్మకంతో 91 వేల భారీ మెజారిటీతో గెలిపించారని, ఇది తన బాధ్యతను మరింత పెంచిందని అన్నారు.మంగళగిరిలో 50 అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని, స్వచ్ఛ మంగళగిరి కార్యక్రమం ద్వారా పార్కులు, రైతు బజార్లు అభివృద్ధి చేస్తున్నామని లోకేశ్ తెలిపారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పైప్ లైన్ ద్వారా గ్యాస్ వంటి ప్రాజెక్టులు సిద్ధమవుతున్నాయని, శ్మశాన వాటికలు అభివృద్ధి చేస్తున్నామని

వివరాలు 2లో..

## పరిటాల రవి హత్యలో జగన్ పాత్ర కూడా ఉంది

### పరిటాల సునీత సంచలన ఆరోపణలు

- మీడియా సమావేశం నిర్వహించిన టీడీపీ ఎమ్మెల్యే పరిటాల సునీత
- పరిటాల రవి హత్య కేసులో సీబీఐ జగన్ ను కూడా విచారించిందని వెల్లడి
- ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో ఫ్యాక్షన్ చిచ్చుపెట్టొద్దని హితవు



పెన్ పవర్ డెస్క్:రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఇవాళ మీడియా సమావేశం ఏర్పాటు చేసి సంచలన ఆరోపణలు చేశారు. తన భర్త పరిటాల రవి హత్యలో జగన్ పాత్ర కూడా ఉందని అన్నారు. పరిటాల రవి హత్య కేసులో సీబీఐ జగన్ ను కూడా విచారించిందని గుర్తు చేశారు. టీవీ బాంబు

వివరాలు 2లో..

## విచారణకు డుమ్మా కొట్టిన కాకాణి గోవర్ధన్

- అక్రమ మైనింగ్ కేసులో పోలీసు విచారణకు కాకాణి డుమ్మా
- ఇప్పటికి మూడు సార్లు నోటీసులు జారీ చేసిన పోలీసులు
- పోలీసులు తదుపరి ఎలాంటి చర్యలు తీసుకుంటారనేది ఆసక్తికరంగా మారిన వైనం



పెన్ పవర్ డెస్క్:క్వార్ట్జ్ అక్రమ మైనింగ్ కేసులో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి ఈరోజు కూడా పోలీసు విచారణకు డుమ్మా కొట్టారు. ఈ కేసులో ఇప్పటి వరకు మూడు సార్లు పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఆయనకు నోటీసులు ఇవ్వడానికి పోలీసులు వెళ్లిన ప్రతిసారీ కాకాణి వారికి కనిపించలేదు. ఇప్పుడు మూడోసారి కూడా విచారణకు ఆయన డుమ్మా కొట్టడంతో...

వివరాలు 2లో..

## మిథున్ రెడ్డికి షాకిచ్చిన హైకోర్టు



- వైసీపీ హయాంలో మద్యం కుంభకోణం జరిగిందని కేసు
- ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేసిన మిథున్ రెడ్డి
- మిథున్ రెడ్డి పిటిషన్ ను కొట్టివేసిన హైకోర్టు

పెన్ పవర్ డెస్క్:వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డికి ఏపీ హైకోర్టు షాకిచ్చింది. మద్యం కుంభకోణం కేసులో మిథున్ రెడ్డి దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్ ను కొట్టివేసింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో మద్యం కుంభకోణం జరిగిందని గత ఏడాది సెప్టెంబర్ 23న సీఐడీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో తన పేరు చేర్చి అరెస్ట్ చేస్తారేమో అనే అనుమానంతో హైకోర్టును

వివరాలు 2లో..

## వక్ఫ్ బిల్లును వ్యతిరేకిస్తూ రేపు నిరసనలకు పిలుపునిచ్చిన హీరో విజయ్ టీవీకే పార్టీ

- లోక్ సభలో వక్ఫ్ సవరణ బిల్లుకు ఆమోదం
- కేంద్రంపై విపక్షాల విమర్శలు
- వక్ఫ్ సవరణ బిల్లుపై తన వైఖరి వెల్లడించిన టీవీకే పార్టీ
- బిల్లును వెనక్కి తీసుకోవాలంటూ డిమాండ్

వివరాలు 2లో..



పెన్ పవర్ డెస్క్:తమిళ సూపర్ స్టార్ విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును వ్యతిరేకిస్తున్నట్టు ప్రకటించింది. ఈ మేరకు వక్ఫ్ సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రేపు తమిళనాడు వ్యాప్తంగా నిరసనలకు పిలుపునిచ్చింది. సుదీర్ఘ చర్చల అనంతరం లోక్‌సభలో ఆమోదం పొందిన

## హెచ్‌సీయూ భూముల వ్యవహారంపై సుప్రీంకోర్టు ఆదేశాలు...

### స్పందించిన రఘునందన్ రావు

- విద్యార్థులకు బీజేపీ అండగా ఉంటుందన్న రఘునందన్ రావు
- విద్యార్థుల పోరాటం ఫలితంగానే కోర్టు ఆదేశాలు వచ్చాయన్న బీజేపీ ఎంపీ
- సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రభుత్వం నడుచుకోవాలని సూచన

వివరాలు 2లో..



## థాయ్ మహిళా ప్రధాని షినవత్రా నుంచి ప్రధాని మోదీకి విశిష్ట కానుక

- థాయ్‌లాండ్ లో పర్యటిస్తున్న ప్రధాని మోదీ
- థాయ్ ప్రధాని షినవత్రాతో ద్వైపాక్షిక సమావేశం
- ఈ సందర్భంగా మోదీకి తిపిటక గ్రంథం బహూకరణ



పెన్ పవర్ డెస్క్:భారత ప్రధాని నరేంద్ర మోదీకి థాయ్‌లాండ్ ప్రధాని పెటోంగ్‌టార్న్ షినవత్రా విశిష్ట కానుకను అందజేశారు. బ్యాంకాక్‌లో జరిగిన ద్వైపాక్షిక చర్చల సందర్భంగా 'ది వరల్డ్ తిపిటక: సజ్జాయ ఫొనెటిక్ ఎడిషన్' పేరు గల బౌద్ధ గ్రంథాన్ని మోదీకి బహుకరించారు. ఈ చర్య భారత్, థాయ్‌లాండ్ మధ్య బలమైన సాంస్కృతిక, భాషాపరమైన, మతపరమైన సంబంధాలకు నిదర్శనంగా నిలుస్తోంది.

వివరాలు 2లో..

## మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టరేట్‌కు బాంబు బెదిరింపు

- కలెక్టరేట్‌లో బాంబు పెట్టినట్లు ఏవోకు మెయిల్ ద్వారా బెదిరింపు
- పోలీసులకు సమాచారం అందించిన అధికారులు
- అనుమానాస్పద వస్తువులేవీ కనిపించలేదన్న పోలీసులు




పెన్ పవర్ డెస్క్:మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టరేట్‌కు బాంబు బెదిరింపులు వచ్చాయి. కలెక్టరేట్ లో బాంబు పెట్టినట్లు ఏవోకు ఈ-మెయిల్ ద్వారా బెదిరింపులు అందాయి. అప్రమత్తమైన అధికారులు వెంటనే పోలీసులకు సమాచారం

వివరాలు 2లో..

## ట్రంప్ సుంకాలు భారత్ ఆర్థిక వ్యవస్థను నాశనం

- ట్రంప్ విధించిన సుంకాలపై కేంద్ర ప్రభుత్వం స్పందించాలి: రాహుల్ గాంధీ
- అమెరికా విధించిన సుంకాలు మన ఆర్థిక వ్యవస్థను పూర్తిగా నాశనం చేస్తాయన్న రాహుల్ గాంధీ
- కేంద్రం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో చెప్పాలని డిమాండ్
- రాహుల్ గాంధీ వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చిన అనురాగ్ ఠాకూర్



వివరాలు 2లో..

## ఓపెన్ ఏఐ సీఈవో శామ్ ఆల్ట్‌మన్‌ను ఏపీకి ఆహ్వానించిన సీఎం చంద్రబాబు




- భారత్ ఏఐకి త్వరగా అలవాటు పడిందన్న శామ్ ఆల్ట్‌మన్
- భారతీయుల క్రియేటివిటీపైనా ప్రశంసలు
- ఏపీలో ఏఐ అభివృద్ధికి గల అవకాశాలను అన్వేషించాలన్న చంద్రబాబు

పెన్ పవర్ డెస్క్:ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ దిగ్గజ సంస్థ ఓపెన్ ఏఐ సీఈవో శామ్ ఆల్ట్‌మన్‌ను అమరావతికి ఆహ్వానించారు. రాష్ట్రంలో ఏఐ ఆధారిత అభివృద్ధికి గల అవకాశాలను పరిశీలించాల్సిందిగా కోరారు. భారతదేశం ఏఐకి త్వరగా అలవాటుపడిందని, భారతీయుల సృజనాత్మకత అద్భుతమని ఆల్ట్‌మన్ చేసిన ట్వీట్ కు చంద్రబాబు స్పందించారు. ఈ మేరకు ఆయనను ఏపీకి ఆహ్వానించారు. ఏఐలో భారత్ దూసుకుపోతోందని

వివరాలు 2లో..

## సునీతను ఏమైనా చేస్తారనే భయం నాలో ఉంది

- వివేకా హత్య కేసులోని నిందితులు ఒక్కొక్కరుగా ప్రాణాలు కోల్పోతున్నారన్న షర్మిల
- అవినాశ్ బెయిల్ పై ఉండటం వల్లే సునీతకు న్యాయం జరగడం లేదని వ్యాఖ్య
- హత్య జరిగినప్పుడు అక్కడ అవినాశ్ రెడ్డి ఉన్నారన్న షర్మిల




పెన్ పవర్ డెస్క్:మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు గురించి ఏపీ కాంగ్రెస్ చీఫ్ షర్మిల కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ కేసులో నిందితుడిగా ఉన్న వైసీపీ ఎంపీ అవినాశ్ రెడ్డి బెయిల్ పై బయట ఉంటూ సాక్షులను బెదిరిస్తున్నారని అన్నారు. వివేకా హత్య కేసులోని సాక్షులు ఒక్కొక్కరుగా ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# ట్రంప్ అన్నంత పనిచేశారుగా...

అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి భారత్ వంటి దేశాలపై ప్రతీకార సుంకాలు విధిస్తామని పలు సందర్భాల్లో హెచ్చరించిన డొనాల్డ్ ట్రంప్ అన్నంత పని చేశారు. భారత్ సహా వివిధ దేశాలపై ప్రతీకార సుంకాలను అమలులోకి తీసుకొచ్చారు. అమెరికా దేశ భవిష్యత్తు అమెరికన్ల చేతుల్లోనే ఉందని మరోసారి నొక్కి చెప్పారు.భారత్ సహా ఇతర దేశాలు తమపై విధిస్తున్న సుంకాల్లో తాము సగమే విధిస్తున్నాని, ఆయా దేశాలపై జాలితోనే ఇలా సగం సుంకాలు ప్రకటించినట్లు ట్రంప్ తెలిపారు. వీటిని రాయితీ టారిఫ్‌లుగా పేర్కొన్నారు. అయితే, భారత్‌పై ఇక తాము 26 శాతం మేర సుంకాలు విధిస్తామని ట్రంప్ ప్రకటించారు. ఈ సందర్భంగా భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గురించి ప్రస్తావిస్తూ మోదీ తనకు గొప్ప స్నేహితుడని, అయితే భారత్ అమెరికాతో సరైన విధంగా వ్యవహరించడం లేదన్నారు. అమెరికాపై 52 శాతం మేర సుంకాలు విధిస్తోందని మరోసారి గుర్తు చేశారు. మరోవైపు.. చైనాపై 34 శాతం మేర సుంకాలు విధిస్తున్నట్లు ట్రంప్ తెలిపారు. అమెరికాకు దిగుమతి అయ్యే అన్ని దేశాల ఉత్పత్తులపై కనీసం 10 శాతం సుంకాలు ఉంటాయని ప్రకటించారు.ఉత్పత్తులపై అమెరికా ప్రతీకార సుంకాలు విధించడం వల్ల ఫార్మా, వ్యవసాయం, రసాయనాలు, మెడికల్ డివైజెస్, ఎలక్ట్రికల్, మెషినరీ వంటి కీలక రంగాలపై ప్రతికూల ప్రభావం పడనుందని నిపుణులు చెబుతున్నారు. వియత్నాం నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై ఏకంగా 46 శాతం సుంకాలు విధిస్తున్నట్లు చెప్పారు ట్రంప్. స్విట్జర్లాండ్‌పై 31 శాతం, తైవాన్ పై 32 శాతం, బ్రిటన్ పై 10 శాతం, బ్రెజిల్ పై 10 శాతం, ఇండోనేషియాపై 32 శాతం, సింగపూర్‌పై 10 శాతం, దక్షిణాఫ్రికాపై 30 శాతం మేర ప్రతీకార సుంకాలు ప్రకటించారు.భారతదేశం నుంచి అమెరికాకు ప్రతి ఏడాది కూడా దాదాపు 18 శాతం ఉత్పత్తులు ఎగుమతి అవుతాయి. ఈ సుంకాలు అమల్లోకి వచ్చిన తర్వాత, ఈ దిగుమతుల ధరలు పెరిగి, అమెరికా మార్కెట్‌లో వాటి పోటీదనాన్ని తగ్గించే అవకాశం ఉంది. ముఖ్యంగా ఈ క్రింది రంగాల్లో ఈ ప్రభావం స్పష్టంగా కనిపించవచ్చు.భారతదేశం ప్రపంచానికి ప్రధానంగా జనరిక్ ఔషధాలను సరఫరా చేసే దేశంగా ఉంది. అమెరికా మార్కెట్‌లో భారతీయ ఔషధ కంపెనీలు గొప్ప స్థాయిలో పోటీ చేస్తున్నాయి. అయితే 26% సుంకం వల్ల ఈ ఉత్పత్తుల ఖర్చులు పెరిగి, వాటి ధరలు ఎక్కువయ్యే అవకాశముంది. ఫలితంగా, అమెరికాలో భారత ఔషధాల అమ్మకాలు తగ్గొచ్చు.భారతదేశం అమెరికాకు భారీగా వస్త్రాలను ఎగుమతి చేస్తుంది. భారతీయ కాటన్, రేష్మి, ఇతర వస్త్ర ఉత్పత్తులు అమెరికా మార్కెట్‌లో ప్రముఖ స్థానాన్ని కలిగి ఉన్నాయి. అయితే, సుంకాల కారణంగా ధరలు పెరిగితే, ఇతర దేశాల పోటీ పెరిగి, భారత వస్త్ర వ్యాపారంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంది.భారతదేశం నుంచి అమెరికాకు పెద్ద మొత్తంలో ఆటో విడిభాగాలను ఎగుమతి చేస్తోంది. ఈ కొత్త సుంకాలు భారత ఆటోమొబైల్ పరిశ్రమను ప్రభావితం చేసి, అమెరికాలో భారతీయ ఆటో భాగాల వినియోగాన్ని తగ్గించవచ్చు. దీనివల్ల భారతదేశ ఆటోమొబైల్ కంపెనీలపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది.భారతదేశం నుంచి అమెరికాకు పెట్రోలియం ఉత్పత్తులు, రసాయన పదార్థాలు కూడా భారీగా ఎగుమతి అవుతున్నాయి. అయితే ఈ సుంకాల వల్ల, ఈ ఉత్పత్తులపై ఖర్చు పెరిగి, వాటి ఎగుమతికి ఆటంకం కలిగే అవకాశం ఉంది,భారతదేశం నుంచి అమెరికాకు ఎలక్ట్రానిక్ ఉత్పత్తులు, ఐటీ సంబంధిత హార్డ్‌వేర్ ఉత్పత్తులు ఎగుమతి అవుతున్నాయి. ఈ రంగంలో ఇప్పటికే చైనా వంటి దేశాలతో పోటీ ఎక్కువగా ఉంది. ఇప్పుడు సుంకాల కారణంగా, భారత ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల పోటీదనం మరింత తగ్గే అవకాశం ఉంది.భారతదేశం నుంచి అమెరికాకు ప్రతి ఏడాది ఎగుమతి అయ్యే ఉత్పత్తులు గణనీయమైన భాగాన్ని కలిగి ఉన్నాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో, భారతదేశం మొత్తం ఎగుమతులు (వస్తువులు, సేవలు కలిపి) సుమారు 776 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ఇందులో అమెరికా భారతదేశం నుంచి ఎగుమతి చేసుకునే వస్తువుల విలువ సుమారు 77.5 బిలియన్ డాలర్లు (వస్తువులు మాత్రమే). ఇది భారతదేశం మొత్తం వస్తు ఎగుమతుల్లో (సుమారు 451 బిలియన్ డాలర్లు) దాదాపు 17-18% ఉంటుంది.అంటే భారతదేశం నుంచి అమెరికాకు ప్రతి ఏడాది సుమారు 17-18% వస్తు ఉత్పత్తులు ఎగుమతి అవుతాయని చెప్పవచ్చు. ఈ ఉత్పత్తుల్లో ప్రధానంగా ఫార్మాస్యూటికల్స్, రత్నాలు, ఆభరణాలు, టెక్స్‌టైల్స్, పెట్రోలియం ఉత్పత్తులు, ఎలక్ట్రానిక్ వస్తువులు ఉంటాయి. దీంతో అమెరికా భారతదేశానికి అతిపెద్ద ఎగుమతి మార్కెట్‌గా ఉంది. ఆ తర్వాత యూఏఈ, చైనా వంటి దేశాలు ఉన్నాయి.ఇక భారతదేశం విదేశాల నుంచి దిగుమతులు చేసుకునే వస్తువుల్లో అమెరికా కీలకమైన భాగస్వామిగా ఉంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో, భారత్ మొత్తం దిగుమతుల విలువ సుమారు 732 బిలియన్ డాలర్లు. ఇందులో అమెరికా నుంచి దిగుమతులు 42.12 బిలియన్ డాలర్లు, అంటే సుమారు 5.75%. అంటే, ప్రతి ఏడాది భారత్ దిగుమతులలో అమెరికా వాటా సుమారు 5-6%గా ఉంటుందిభారతదేశం అమెరికా నుంచి దిగుమతి చేసుకునే ప్రధాన వస్తువులలో క్రూడ్ పెట్రోలియం (ముడి చమురు), బొగ్గు ఉత్పత్తులు (కోల్ బ్రికెట్స్) ,గ్యాస్ టర్బైన్స్, ఎలక్ట్రానిక్ ఉత్పత్తులు, రత్నాలు, ఆభరణాలు ఉన్నాయి. అమెరికా భారత్‌కు ముఖ్యమైన వ్యాపార భాగస్వామిగా ఉన్నప్పటికీ, చైనా (17%), రష్యా (9%) పెద్ద వాటా కలిగి ఉండటం విశేషం. అయినప్పటికీ, అమెరికా నుంచి వచ్చే టెక్నాలజీ ఉత్పత్తులు, ఖరీదైన రత్నాలు, ఇంధన వనరులు భారత మార్కెట్‌ను ప్రభావితం చేస్తున్నాయి.

# పరిటాల రవి హత్యలో జగన్ పాత్ర కూడా ఉంది

- మొదటి పేజీ తరువాయి

గురించి మాట్లాడుతున్న వారు కారు బాంబు గురించి కూడా మాట్లాడాలని వ్యాఖ్యానించారు. రాజశేఖర్ రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో 45 మందిని హత్యకు గురయ్యారని ఆరోపించారు. రాప్తాడులో తోపుదుర్తి సోదరులు మురా కక్షలను రెచ్చగొడుతున్నారని సునీత ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓబుల్ రెడ్డి, మద్దెలచెరువు సూరి కుటుంబాలను ఫ్యాక్షనిజంలోకి లాగుతున్నారని విమర్శించారు. "తోపుదుర్తి సోదరుల మాటలు నమ్మి ఈ కుట్రలో భాగస్వామ్యం కావొద్దని కనుముక్కల ఉమ, గంగుల భానుమతికి విజ్ఞప్తి చేస్తున్నా... ఇప్పటికే మన మూడు కుటుంబాలు ఫ్యాక్షన్ కారణంగా చాలా నష్టపోయాయి. మనం కోలుకోవడానికి చాలా సమయం పట్టింది... ఇప్పుడు మళ్లీ తోపుదుర్తి సోదరులు ఫ్యాక్షన్ ఉచ్చులోకి లాగడానికి ప్రయత్నిస్తున్నారు. తోపుదుర్తి సోదరులు ఏం చెప్పినా జగన్ నమ్మేస్తున్నారు... ఐదేళ్లు సీఎంగా పనిచేసిన మీరు నిజానిజాలు తెలుసుకోరా? జగన్ శుక్రవారం నాడు పాపిరెడ్డిపల్లి గ్రామానికి వస్తానంటున్నారు... ఆయనకు శుక్రవారం కలిసొచ్చిందేమో! వచ్చేటప్పుడు జగన్ తన సూట్ కేసులో కాస్త దుస్తులు ఎక్కువగా తెచ్చుకుంటే బాగుంటుంది... లింగమయ్య కుటుంబాన్నే కాదు, మీ పార్టీ వల్ల నష్టపోయిన వారి కుటుంబాలను కూడా పరామర్శించాలి కదా! ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో ఫ్యాక్షన్ చిచ్చు పెట్టవద్దని జగన్ కు స్పష్టం చేస్తున్నా" అంటూ పరిటాల సునీత పేర్కొన్నారు.

# మిథున్ రెడ్డికి షాకిచ్చిన హైకోర్టు

- మొదటి పేజీ తరువాయి

మిథున్ రెడ్డి ఆశ్రయించారు. ఈ పిటిషన్ పై మార్చి 24న హైకోర్టులో వాదనలు జరిగాయి. తీర్పును రిజర్వ్ చేసిన హైకోర్టు... మార్చి 3న తీర్పును వెలువరిస్తామని... అప్పటి వరకు మిథున్ రెడ్డిని అరెస్ట్ చేయవద్దని పోలీసులను ఆదేశించింది. ఈరోజు మిథున్ రెడ్డి పిటిషన్ ను కొట్టివేస్తూ తీర్పును వెలువరించింది. వాదనల సందర్భంగా సీఐడీ తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా వాదనలు వినిపిస్తూ... ఈ కేసులో మిథున్ రెడ్డిని నిందితుడిగా చేర్చలేదని, ఆయనకు నోటీసులు ఇవ్వలేదని, విచారణకు హాజరు కావాలని ఆదేశించలేదని కోర్టుకు తెలిపారు. ఎఫ్ఐఆర్ లో పేరు లేనప్పుడు బెయిల్ కోరడానికి వీల్లేదని చెప్పారు.

# విచారణకు డుమ్మా కొట్టిన కాకాణి గోవర్ధన్

- మొదటి పేజీ తరువాయి

పోలీసులు తదుపరి ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి. గతంలో కూడా ఓ కేసులో ఇలాగే తప్పించుకు తిరిగినట్టు ఆరోపణలు ఎదుర్కొన్న కాకాణి... చివరకు సుప్రీంకోర్టులో ముందస్తు బెయిల్ తెచ్చుకున్నారు.

# ట్రంప్ సుంకాలు భారత్ ఆర్థిక వ్యవస్థను నాశనం

**పెన్ పవర్ డెస్క్:**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ ఉత్పత్తులపై విధిస్తున్న సుంకాల విషయంలో కేంద్ర ప్రభుత్వం స్పందించాలని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. లోక్‌సభలో ఆయన మాట్లాడుతూ, అమెరికా సుంకాలు మన ఆర్థిక వ్యవస్థను తీవ్రంగా దెబ్బతీస్తాయని అన్నారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోబోతుందో స్పష్టం చేయాలన ఆయన కోరారు.

ఈ సందర్భంగా రాహుల్ గాంధీ భారత్-చైనా సరిహద్దు వివాదాన్ని ప్రస్తావిస్తూ కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు చేశారు. చైనా మన దేశానికి చెందిన 4 వేల కిలోమీటర్లకు పైగా భూభాగాన్ని ఆక్రమించిందని, దీనిపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బీజింగ్ ప్రభుత్వానికి లేఖ రాసినట్లు తెలిసిందని ఆయన అన్నారు. ఆక్రమిత భూభాగాన్ని త్వరగా వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయం అక్కడి రాయబారి ద్వారా వెలుగులోకి వచ్చిందని తెలిపారు.

రాహుల్ గాంధీ వ్యాఖ్యలకు

బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్ ప్రతిస్పందించారు. ఏ ప్రభుత్వ హయాంలో చైనా ఈ ప్రాంతాన్ని ఆధీనంలోకి తీసుకుందో అందరికీ తెలుసని అన్నారు. డోక్లాం ఘటన జరుగుతున్న సమయంలో బీజింగ్ అధికారులతో కలిసి ఎవరు సూప్ తాగారో కూడా తెలుసని ఠాకూర్ విమర్శించారు. ఇలాంటి అంశాలను రాజకీయం చేయడం వల్ల ఎటువంటి ప్రయోజనం ఉండదని, గతంలో జరిగిన తప్పిదాలకు కాంగ్రెస్ సమాధానం చెప్పాలని నిలదీశారు.

## హెచ్‌సీయూ భూముల వ్యవహారంపై

# సుప్రీంకోర్టు ఆదేశాలు...

**పెన్ పవర్ డెస్క్:**హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) భూముల వ్యవహారానికి సంబంధించి సుప్రీంకోర్టు వెలువరించిన ఉత్తర్వులపై బీజేపీ నేత, మెదక్ లోక్‌సభ సభ్యుడు రఘునందన్ రావు స్పందించారు. కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూముల విషయంలో హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం (హెచ్‌సీయూ) విద్యార్థులకు బీజేపీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. విద్యార్థుల పోరాటం ఫలితంగానే ఈ కోర్టు ఆదేశాలు వెలువడ్డాయని రఘునందన్ రావు పేర్కొన్నారు. విశ్వవిద్యాలయ భూముల పరిరక్షణ కోసం తాము సైతం పోరాటం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు నడుచుకోవాలని సూచించారు. ఒక్క చెట్టును కొట్టివేయలన్నా అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందని, అలాంటిది వందల సంఖ్యలో చెట్లను కొట్టివేస్తే ఎలా? అని రఘునందన్ రావు ప్రశ్నించారు. తమను ఎవరూ ఏమీ చేయలేరని భావించిన ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఉత్తర్వులు చెంపదెబ్బలాంటివని అభివర్ణించారు.

# ఓపెన్ ఏఐ సీఈవో శామ్ ఆల్ట్‌మన్‌ను ఏపీకి ఆహ్వానించిన సీఎం చంద్రబాబు

- మొదటి పేజీ తరువాయి

శామ్ ఆల్ట్ మన్ చేసిన వ్యాఖ్యల పట్ల చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఏఐ అభివృద్ధికి కేంద్రంగా మార్చేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. "మీరు చెప్పింది అక్షరాలా నిజం! భారతదేశం తన ప్రయాణాన్ని ఇప్పుడే ప్రారంభించింది. ఆంధ్రప్రదేశ్ ఏఐ ఆధారిత అభివృద్ధికి కేంద్రంగా మారడానికి సిద్ధంగా ఉంది. మీ తదుపరి భారత పర్యటనలో మిమ్మల్ని అమరావతికి ఆహ్వానించడం నాకు సంతోషంగా ఉంది. భవిష్యత్తును రూపొందించడంలో మా విజన్‌ను మీతో పంచుకుంటాను" అని చంద్రబాబు పేర్కొన్నారు.

రాష్ట్రం ఏఐతో పాటు క్వాంటం టెక్నాలజీలో కూడా ముందంజలో ఉంటుందని చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సాంకేతిక రంగంలో పెట్టుబడులు పెట్టడానికి సిద్ధంగా ఉందని, ఓపెన్ ఏఐతో కలిసి పనిచేయడానికి ఆసక్తిగా ఉందని తెలిపారు.

# సునీతను ఏమైనా చేస్తారనే భయం నాలో ఉంది

- మొదటి పేజీ తరువాయి

వివేకా కూతురు సునీత ప్రాణాలకు కూడా రక్షణ లేదని షర్మిల అన్నారు. ఈ కేసులో నిందితులుగా ఉన్నవారు సునీతను ఏమైనా చేస్తారనే భయం తమలో ఉందని చెప్పారు. ఇటీవల తనకు కొన్ని విషయాలు తెలిశాయని... అవి తనను ఆలోచింపజేస్తున్నాయని అన్నారు. సునీతకు ఇద్దరు పిల్లలు ఉన్నారని చెప్పారు. అవినాశ్ బెయిల్ రద్దు చేయాలంటూ ప్రభుత్వం దాఖలు చేసిన అఫిడవిట్ లో పలు విషయాలను పేర్కొందని షర్మిల తెలిపారు. విచారణ అధికారులను అవినాశ్ పిలిపించుకుని బెదిరించినట్టు అఫిడవిట్ లో ఉందని... తప్పుడు రిపోర్టుపై అధికారులతో అవినాశ్ సంతకాలు చేయించినట్టు ఉందని చెప్పారు. అవినాశ్ బెయిల్ పై ఉండటం వల్లే సునీతకు న్యాయం జరగడం లేదని అన్నారు. వివేకాను సునీత, ఆమె భర్త చంపించినట్టు తప్పుడు రిపోర్టు ఇచ్చారని తెలిపారు. హత్య జరిగినప్పుడు ఘటనాస్థలిలో ఉన్నది అవవినాశ్ రెడ్డేనని చెప్పారు.

# ఇచ్చిన మాట ప్రకారమే పేదలకు 'పట్టా'భిషేకం

- మొదటి పేజీ తరువాయి

ఆయన పేర్కొన్నారు. త్వరలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామని, చేనేతలకు కామన్ ఫెసిలిటీ సెంటర్, స్వర్ణకారులకు జెమ్స్ అండ్ జ్యువెలరీ పార్కు ఏర్పాటు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. మంగళగిరిని తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా మారుస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# థాయ్ మహిళా ప్రధాని షినవత్రా నుంచి ప్రధాని మోదీకి విశిష్ట కానుక

- మొదటి పేజీ తరువాయి

'తిపిటక' అంటే పాలీ భాషలో 'మూడు బుట్టలు'. ఇది బౌద్ధ ధర్మ గ్రంథాలలో ప్రధానమైనది. ఇందులో బౌద్ధ సన్యాసుల నియమాలు, సూత్రాలు, బోధనలు సంగ్రహించబడి ఉంటాయి. ఈ గ్రంథం మొత్తం 108 సంపుటాలుగా ఉంది.

థాయ్ ప్రభుత్వం రాజు భూమిబల్ అతుల్యతేజ్ (రామ-9), రాణి సిరికిట్ 70వ వార్షికోత్సవం సందర్భంగా 2016లో 'వరల్డ్ తిపిటక ప్రాజెక్ట్'లో భాగంగా ఈ ప్రత్యేక ఎడిషన్‌ను ప్రచురించింది. పాలి, థాయ్ లిపులలో రూపొందించబడిన ఈ గ్రంథం, తొమ్మిది మిలియన్లకు పైగా పదాలను కలిగి ఉంది. అంతేకాకుండా, ఇది కచ్చితమైన ఉచ్చారణతో పఠించేందుకు వీలుగా రూపొందించబడింది. కానుక అందుకున్న సందర్భంగా ప్రధాని మోదీ స్పందిస్తూ, "ప్రధాని షినవత్రా నాకు తిపిటకను బహుమతిగా ఇచ్చారు. లార్డ్ బుద్ధుని పుణ్యభూమి అయిన భారతదేశం తరపున నేను దానిని వినయంగా స్వీకరించాను. గత సంవత్సరం, భారతదేశం లార్డ్ బుద్ధుని పవిత్ర అవశేషాలను, ఇద్దరు ప్రధాన మతగురువులను థాయ్‌లాండ్‌కు పంపింది. దాదాపు నాలుగు మిలియన్ల మంది ప్రజలు ఆ అవశేషాలకు నివాళులర్పించారని తెలుసుకోవడం చాలా సంతోషంగా ఉంది" అని అన్నారు.

థాయ్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, థాయ్‌లాండ్ రాజులు బౌద్ధమత సంరక్షకులుగా ఉండటంతో పాటు, తిపిటకను ఇతర దేశాలకు వ్యాప్తి చేయడంలో చురుకైన పాత్ర పోషిస్తున్నారు.

# వక్ఫ్ బిల్లును వ్యతిరేకిస్తూ రేపు నిరసనలకు పిలుపునిచ్చిన హీరో విజయ్ టీవీకే పార్టీ

- మొదటి పేజీ తరువాయి

ఈ వివాదాస్పద బిల్లుపై విపక్షాల నుంచి తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఈ క్రమంలో టీవీకే పార్టీ కూడా తన వైఖరి వెల్లడించింది. అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసనలు చేపట్టేందుకు టీవీకే ప్రణాళికలు సిద్ధం చేసింది. ప్రజల భాగస్వామ్యం ఎక్కువగా ఉండేలా నిరసనలను సమర్థవంతంగా నిర్వహించాలని అధినేత విజయ్ తన పార్టీ జిల్లా కార్యదర్శులకు సూచించారు.వక్ఫ్ (సవరణ) బిల్లు-2025 రాజకీయంగా తీవ్ర దుమారం రేపింది. లోక్‌సభలో బిల్లుకు అనుకూలంగా 288 మంది సభ్యులు ఓటు వేయగా, 232 మంది వ్యతిరేకించారు. ప్రతిపక్షాల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురైనప్పటికీ, ప్రతిపాదించిన సవరణలన్నీ వాయిస్ ఓటు ద్వారా తిరస్కరించబడ్డాయి. ఎన్డీయే ఈ బిల్లు మైనారిటీ వర్గాలకు సాధికారత కల్పించే లక్ష్యంతో రూపొందించామని సమర్థించుకుంది. అయితే ప్రతిపక్ష పార్టీలు దీనిని 'ముస్లిం వ్యతిరేకం' అని విమర్శించాయి. ప్రభుత్వం లౌకిక విలువలను దెబ్బతీస్తోందని ఆరోపించాయి.భారతదేశంలో మైనారిటీలు మెరుగైన రక్షణ లభిస్తోందని కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు వాదించారు. "ప్రపంచంలో భారతదేశం కంటే సురక్షితమైన ప్రదేశం మైనారిటీలకు మరొకటి లేదు. భారతదేశంలో మెజారిటీ ప్రజలు పూర్తిగా లౌకికవాదులు కాబట్టి, మైనారిటీలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రక్షణ పొందుతున్నారు" అని మంత్రి రిజిజు చర్చ సందర్భంగా అన్నారు.

# మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టరేట్‌కు బాంబు బెదిరింపు

- మొదటి పేజీ తరువాయి

అందించారు. పోలీసులు డాగ్ స్క్వాడ్‌తో కలెక్టరేట్ ఆవరణలో ముమ్మర తనిఖీలు చేపట్టారు.

అయితే, అనుమానాస్పద వస్తువులేవీ కనిపించలేదని పోలీసులు తెలిపారు. తనిఖీలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. మరోవైపు, బెదిరింపులు ఎక్కడి నుంచి వచ్చాయనే విషయంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పెన్ పవర్
వై.ఎస్.ఆర్. కడప
అన్నమయ్య జిల్లా

## తిరుచ్చిపై రుక్మిణి సత్యభామ శ్రీ కృష్ణ స్వామి



**తిరుచానూరు/పెన్ పవర్ /ఏప్రిల్ 03 :** శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో తిరుచ్చి వాహనం పైన రుక్మిణి సత్యభామ శ్రీ కృష్ణ స్వామి ఆలయ నాలుగు మాడ వీధులలో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఉదయం స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి అభిషేక కార్యక్రమాలను ఆలయ అర్చకులు నిర్వహించారు. అనంతరం భక్తులను సర్వదర్శనానికి అనుమతించారు. శ్రీకృష్ణ స్వామి రోహిణి నక్షత్రం సందర్భంగా తిరుచ్చి వాహనంపై కొలువుదీరి తిరుమాడ వీధులలో ఊరేగి భక్తులను కటాక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో గోవిందరాజన్, టెంపుల్ ఇన్స్పెక్టర్ ప్రసాద్, సుభాష్కర్ నాయుడు, చలపతి, సుబ్బరాయుడు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## అలిపిరి టోల్ గేట్‌ను ఆకస్మికంగా తనిఖీ



**తిరుపతి/పెన్ పవర్/ ఏప్రిల్ 03 :** తిరుపతి అలిపిరి టోల్ గేట్‌ను తిరుమల తిరుపతి దేవస్థానం చీఫ్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్ వి హర్షవర్ధన్ రాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. వాహనాల తనిఖీలలో అప్రమత్తంగా ఉండాలన్నారు. టోల్ గేట్ లో భక్తులు తిరుమల చేరుకునేందుకు ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అలిపిరి టోల్ గెట్ వద్ద విఐపి వాహనాలు, సామాన్యప్రజల కార్లు వెళ్ళు మార్గంలతో పాటు ద్విచక్ర వాహనాలు వెళ్ళు మార్గాలను పరిశీంచి పలు సూచనలు చేశారు. తిరుమలకు వెళ్ళుతున్న ద్విచక్ర వాహనాలు, కార్లులను సిబ్బంది చెకింగ్ చేస్తూ అప్రమత్తంగా ఉండాలన్నారు. వాహనాలు వెళ్ళుతున్న సమయంలో స్కానింగ్ జరుగుతున్న విధానాన్ని పరిశీలించారు. అదేవిధంగా తిరుమలకు వస్తున్న భక్తుల బ్యాగులు, ఇతర వస్తువులు తరువాయి 5లో..

## 14న రాష్ట్ర పర్యటనకు రానున్న 16వ ఆర్థిక సంఘం



**అమరావతి, పెన్ పవర్ ప్రతినిధి, ఏప్రిల్ 3 :** నాలుగు రోజుల పర్యటన నిమిత్తం 16వ ఆర్థిక సంఘం ఈనెల 14న రాష్ట్రానికి రానుంది. ఆర్థిక సంఘంతో ఈనెల 16న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమావేశం కానున్నారు. 16వ ఆర్థిక సంఘానికి రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని వివరించి తగు సాయం చేయాలని కోరనున్నారు. దీనిపై సన్నాహకంగా ఆర్థిక శాఖ అధికారులతో ముఖ్యమంత్రి గురువారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్థిక & ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పియూష్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తిలో పూజా హెగ్డే పూజలు



**శ్రీకాళహస్తి, పెన్ పవర్, ప్రతినిధి, ఏప్రిల్ 3 :** శ్రీకాళహస్తీశ్వర స్వామివారిని హీరోయిన్ పూజ హెగ్డే కుటుంబ సభ్యులతో కలసి గురువారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి శ్రీజ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామివారి దర్శనం చేయించారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో టెంపుల్ ఇన్స్పెక్టర్ హరి యాదవ్, ఏపీఆర్వో రవి, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఆమె రూ.5వేల టికెట్తో రాహు కేతు పూజ నిర్వహించుకున్నారు.

## రిమ్స్ హాస్పటల్‌లో ఆహారం తనిఖీలు





**కడప, పెన్ పవర్ రాయలసీమ, కోఆర్డినేటర్ ఏప్రిల్ 3 :** కడప నగరం స్థానిక రిమ్స్ హాస్పిటల్ నందు రోగులకు అందించే ఆహారం తనిఖీ చేసి నాణ్యతను ఏపీ ఫుడ్ స్టేట్ కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలో ఉన్న అన్ని ప్రభుత్వ మరియు ప్రైవేట్ హాస్పిటల్స్ నందు ఆహార నాణ్యత విషయంలో ఫుడ్ అండ్ సేఫ్టీ ఇన్స్పెక్టర్లు షంషీర్ ఖాన్ మరియు డాక్టర్ హరిత కడప నగరంలోని రిమ్స్ హాస్పిటల్ ఆకస్మికంగా తనిఖీ చేసి పోషక విలువలు కలిగిన ఆహారం అందించాలని స్వయంగా ఆహారం తిని పరీక్షించారు. మంచి ఆహారం వలన వ్యాధిగ్రస్తులు త్వరగా ఆరోగ్యవంతంగా కోలుకుంటారు. తనఖీలో భాగంగా ఎక్కడైనా ప్రభుత్వ, ప్రవేట్ హాస్పిటల్‌లో, హెూటల్స్‌లో, నాణ్యత లోపం, అపరిశుభ్రంగా ఉన్నటువంటి ఆహారమును, ముడి పదార్థాలను ఫుడ్ సేఫ్టీ అధికారులు పరీక్షల నిమిత్తమై ల్యాబ్ తరలించి తర్వాత చర్యలు తీసుకుంటామని సూచించారు. అలాగే వంట గదులను పరిశుభ్రంగా ఉంచుకోవాలి కాబట్టి ఎంతో ఓర్పుతో నేర్పుతో పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు.

### ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తున్న

## కూటమి ప్రభుత్వం

### - ఎమ్మెల్యే డా. నెలవల విజయశ్రీ



**దొరవారి సత్రం, పెన్ పవర్ ప్రతినిధి, ఏప్రిల్ 3 :** కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తూ ప్రజలకు అండగా ఉండి సీఎం సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం చేస్తుందని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నలవల విజయశ్రీ అన్నారు. దొరవారిసత్రం మండలం లోని కట్టువపల్లి గ్రామానికి చెందిన అందలమాల వెంకటాద్రి అత్యవసర మెదడు శస్త్రచికిత్స కోసం గురువారం ఏడు లక్షల రూపాయల సీఎం సహాయనిధి చెక్కును అందజేశారు. ఆపద సమయంలో బాధిత కుటుంబ సభ్యుల విజ్ఞప్తిమేరకు ఎమ్మెల్యే డా. విజయశ్రీ స్పందించి రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, ప్రభుత్వ సహాయ నిధి ద్వారా మంజూరైన రూ. 7 లక్షలు బాధితులకు అందజేశారు .ఈ సందర్భంలో బాధిత కుటుంబం ముఖ్యమంత్రి చంద్రబాబు,ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ లకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దొరవారిసత్రం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వేమసాని శ్రీనివాసులు నాయుడు, ప్రసాద్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## పీఎం సూర్య ఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోండి




**నంద్యాల పెన్ పవర్ ఏప్రిల్ 3 :** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం సూర్య ఘర్ పథకాన్ని ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకునేలా విస్తృత ప్రచారం కల్పించి ప్రజలలో అవగాహన తీసుకురావాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి విద్యుత్ అధికారులు, వెండర్లను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో పీఎం సూర్య ఘర్, కుసుమ్ పథక అమలుపై జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ వినియోగదారుల విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం సూర్య ఘర్ పథకాన్ని ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకునేలా విస్తృత ప్రచారం నిర్వహించి ప్రజలలో అవగాహన తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఇప్పటివరకు 87,632 మంది ఎస్సీ, ఎస్టీ వినియోగదారులు సూర్య ఘర్ సోలార్ ప్యానల్ కనెక్షన్ల కోసం పేర్లు నమోదు చేయించుకున్నారన్నారు. పీఎం సూర్య ఘర్ సంబంధించి ప్రతి నియోజకవర్గంలో పదివేల ఇళ్లపై సోలార్ ఫలకలు ఏర్పాటు చేసేలా లక్ష్యాన్ని నిర్దేశించారని కేటాయించిన లక్ష్యాన్ని అధిగమించి లక్ష గృహాలకు సోలార్ ప్యానల్ ఏర్పాటు చేసేందుకు ప్రణాళికల సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఒక కిలో వాట్ యూనిట్ ఏర్పాటు చేసుకుంటే 30 వేలు, రెండు కిలో వాట్ లకు 60 వేలు, మూడు కిలోమీటర్ యూనిట్లకు 78 వేల రూపాయల వరకు సబ్సిడీ ఇవ్వడం జరుగుతుందన్నారు. మిగిలిన మొత్తాన్ని బ్యాంకుల నుండి రుణం సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ప్రతి ఇంటింటికి వెళ్లి వినియోగదారులకు వివరించేలా సచివాలయ ఎనర్జీ అసిస్టెంట్లను ఆదేశించాలని విద్యుత్ ఈఈ, డిఈలను కలెక్టర్ సూచించారు. సోలార్ ప్యానల్ నుండి ఉత్పత్తి అయ్యే విద్యుత్తును పవర్ గ్రిడ్ కు పంపించి గ్రిడ్ ద్వారా విద్యుత్ సరఫరా అందించే విషయాన్ని కూడ వినియోగదారులకు స్పష్టంగా అర్థమయ్యేలా అవగాహన కల్పించాలన్నారు. మండలాలో స్థానికంగా ఉన్న వెండర్లను గుర్తించి ఆయా ప్రాంతాలను కేటాయించాలని కలెక్టర్ సూచించారు. నమోదు చేసుకున్న వినియోగదారులకు ఆలస్యం లేకుండా త్వరితగతిన ఆమోదించి సోలార్ ప్యానల్ ఏర్పాటుకు వెండర్లు చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు సంబంధించిన ప్యానెల్ లను చెన్నై, బెంగళూరు, హైదరాబాదులో నుండి ముందుగానే తెప్పించుకోవాలని వెండర్లకు కలెక్టర్ సూచించారు. పీఎం కుసుం పథకం కింద జిల్లాలో 130 విద్యుత్ సబ్ స్టేషనులకు అవసరమైన స్థలాల సేకరణకు ప్రతిపాదనలు ఇవ్వాలని కలెక్టర్ విద్యుత్ అధికారులను ఆదేశించారు. మిడుతూరు మండలం కడుమూరు గ్రామంలో 143 ఎకరాల స్థలాలను స్వాధీనం చేసుకోవాలన్నారు. అలాగే కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్లకు గుర్తించిన మూడువేల ఎకరాలను కూడా విద్యుత్ సబ్ స్టేషన్ల ఏర్పాటుకు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ సుధాకర్ కుమార్, ఈఈ టెక్నికల్ నాగేశ్వరరావు, నంద్యాల ఈఈ శ్రీనివాసులరెడ్డి, డోను ఈ ఈ కమలాకర్ రావు, ఎల్డిఎం రవీంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### కర్నూల్ పట్టణ నిరాశ్రయుల వసతి గృహాన్ని

## తనిఖీ చేసిన న్యాయమూర్తి



**కర్నూల్ పెన్ పవర్ ఏప్రిల్ 3 :** జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి గురువారం ఇందిరా గాంధి నగర్ నందు గల పట్టణ నిరాశ్రయుల వసతి గృహాన్ని తనిఖీ చేశారు. కార్యాలయాలకు సంబందించిన రిజిస్టర్‌లను మైంటైన్ చేయడం లేదని గుర్తించి అక్కడి నిర్వాహకురాలిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడ ఉండే ప్రతిఒక్కరిని వారికి అందించే భోజన వసతి సదుపాయాలను, వైద్య సదుపాయల గురించి అడుగగా అక్కడ ఉండే వారు జడ్జి గారికి అక్కడి సౌకర్యాలు బాగా లేవని తెలిపారు. వారికీ వుండే చట్ట పరమైన హక్కుల గురించి వివరించారు. అనంతరం జడ్జి సంబధిత అధికారులతో మాట్లాడి అక్కడి సౌకర్యాలను మెరుగు పరుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ నిర్వాహకురాలు శకుంతల తదితరులు పాల్గొన్నారు.

## అత్యాధునిక హంగులతో తిరుపతి రైల్వేస్టేషన్




**తిరుపతి, పెన్ పవర్ రాయలసీమ కోఆర్డినేటర్ ఏప్రిల్ 3 :** తిరుపతి రైల్వేస్టేషన్ అత్యాధునిక హంగులతో ముస్తాబవుతోంది. తిరుపతి రైల్వేస్టేషన్ను కేంద్ర ప్రభుత్వం అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దుతోంది. రెండేళ్ల క్రితం రూ.300 కోట్లతో అభివృద్ధి, ఆధునికీకరణ పనులు చేపట్టారు. ప్రస్తుతం దక్షిణం వైపు నూతన భవన నిర్మాణ పనులు 70% పూర్తయ్యాయి. దీనిని మరో రెండు నెలల్లో ప్రయాణికులకు అందుబాటు లోకి తెస్తామని తిరుపతి రైల్వేస్టేషన్ డైరెక్టర్ సత్యనారాయణ చెప్పారు.

## పాఠశాలల పునర్వ్యవస్థీకరణ పూర్తి : కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్




**అనంతపురం, పెన్ పవర్ ఏప్రిల్ 03 :** ప్రభుత్వం 117 జీవోను ఉపసంహరించుకున్న నేపథ్యంలో పాఠశాలల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ జిల్లాలోని మండల విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం అనంతపురం కలెక్టరేట్లోని రెవెన్యూ భవన్లో మండల విద్యాశాఖ అధికారులతో పాఠశాలలు పునర్వ్యవస్థీకరణ ప్రక్రియపై పూర్తిస్థాయి సమీక్షను జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాల యాజమాన్య కమిటీల ఆమోదంతో పాఠశాలల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలన్నారు. ఎక్కడ కూడా ప్రజల అభీష్టానికి వ్యతిరేకంగా ఈ ప్రక్రియను పూర్తి చేయరాదని, విద్యార్థి ఉపాధ్యాయ నిష్పత్తిని, సౌకర్యాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ



మార్గదర్శకాల మేరకు సశాస్త్రీయంగా ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఎక్కడ ఎలాంటి సమస్యలు రాకుండా పూర్తి అవగాహనతో, అప్రమత్తతతో ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. పునర్ వ్యవస్థీకరణ ప్రక్రియ దాదాపు పూర్తయిన నేపథ్యంలో రేపటిలోగా పాఠశాలలను ఖరారు చేయాలని సూచించారు. ఇప్పటికే 93 శాతం పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ పూర్తయిందని, ఈ ప్రక్రియలో ఎంఈవోలు విద్యాశాఖ అధికారులు చక్కగా పనిచేశారని అభినందించారు. మిగిలిన ఏడు శాతం పూర్తికాని పాఠశాలల విషయంలో స్థానిక శాసనసభ్యులతో మాట్లాడి ఎస్ఎంసి సభ్యులు, తల్లిదండ్రులు, గ్రామస్తులను ఒప్పించి సామరస్యంగా ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. అంతకుముందు మహిళా శిశు సంక్షేమ శాఖ సిడిపిఓలు, ఎంఈఓలతో సమీక్ష నిర్వహించగా, అంగన్వాడీలలో చదువుతున్న ప్రీ ప్రైమరీ 1, ప్రీ ప్రైమరీ 2 పిల్లలు ఖచ్చితంగా ప్రభుత్వ పాఠశాలలోనే ఒకటో తరగతిలో చేరేలాగా సమన్వయ పరచుకొని తల్లిదండ్రులను ప్రేరేపించి 100 శాతం అడ్మిషన్లు జరిగేలా చూడాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.ప్రసాద్ బాబు, సమగ్ర శిక్ష ఏపిసి శ్రీమతి శైలజ, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి శ్రీదేవి, సమగ్ర శిక్ష సీఎంవో గోపాలకృష్ణ, ఎంఈఓలు తదితరులు పాల్గొన్నారు.

### డయేరియా నియంత్రణపై

## జిల్లా వ్యాప్తంగా క్యాంపెయిన్ నిర్వహణ

### జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి







**కడప, పెన్ పవర్ రాయలసీమ కోఆర్డినేటర్ ఏప్రిల్ 3 :** వైఎస్ఆర్ జిల్లాకు డయేరియా రహిత, ఆరోగ్యసహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సభ్యులను జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లోని బోర్డు మీటింగ్ హాలు నుంచి... ఏప్రిల్ 15 నుండి డయేరియా (అతిసార) నియంత్రణ క్యాంపెన్ పై.. జిల్లా కలెక్టర్ డా. శ్రీదర్ చెరుకూరి జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో స్టాప్ డయేరియా క్యాంపెయిన్ విస్తృతంగా చేపట్టి విజయవంతం చేయాలని ఆదేశించారు. జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీతో.. నియోజకవర్గ స్థాయి, మండల స్థాయి, గ్రామ స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో ఎక్కడా అతిసార కేసులు వ్యాప్తి చెందకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం ఆరోగ్యం మరియు కుటుంబ సంక్షేమ శాఖ అధికారులు మైక్రో ప్లాన్ అమలు చేయాలన్నారు. జిల్లాలో అతిసార కేసుల వ్యాప్తి అరికట్టేందుకు కమ్యూనికేషన్ స్ట్రాటజీ/మానిటరింగ్ మెకానిజం అత్యంత ముఖ్యంగా అమలు చేయాలన్నారు. ఈ విషయమై వర్క్‌షాప్ నిర్వహించాలని, డోర్ టు డోర్ ప్రచారం నిర్వహించి.. ఆశా వర్కర్ ల ద్వారా తక్కువ బరువున్న చిన్నారులకు జింక్ ప్యాకెట్లను అందించాలన్నారు. జిల్లాలో పెద్ద ఎత్తున ఐఈసి యాక్టివిటీలను చేపట్టాలన్నారు. అన్ని మున్సిపాలిటీలు, పంచాయతీల్లో పారిశుధ్య పరిరక్షణా చర్యలు చేపట్టేందుకు పబ్లిక్ హెల్త్, మున్సిపాలిటీ అధికారులు, గ్రామీణ నీటిసరఫరా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆరోగ్య శాఖ సహకారంతో స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ అధికారులు అంగన్‌వాడీలలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు/జింక్ కార్నర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. చిన్నారుల్లో గ్రోత్ మానిటరింగ్ నిర్వహించడంపై అంగన్‌వాడీ వర్కర్లకు శిక్షణ ఇవ్వడం మరియు తక్కువ బరువున్న పిల్లలకు పోషకాహారం అందించడం చేయాలన్నారు. ఎక్కడా అతిసార, సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా అనుబంధ శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పకడ్బందీగా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం క్యాంపెయిన్ కు సంబంధించిన గాడ్ పత్రాలను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో.. డిఎంహెచ్ఓ డా. నాగరాజు, ఇంచార్జ్ డిపివో ఖాదర్ బాషా, జీజీహెచ్ సూపరింటెండెంట్ డా. రమాదేవి, ఎపిడమాలజిస్ట్ ఖాజా మోహిద్దీన్, ఐఎంఏ వైద్యులు, డిఆర్డీఏ, ఐసిడిఎస్, పంచాయతీ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఆర్డబ్ల్యు ఎస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రిమ్స్ హాస్పటల్‌లో ఆహారం తనిఖీలు



(మొదటి పేజీ తరువాయి) పోషక ఆహారం వలన, రోగులు త్వరగా ఆరోగ్యవంతంగా ఉండేందుకు ఫుడ్ కాంట్రాక్టర్లు మంచి ఆహార, ముడి సరుకులను అందించాలని కడప ఫుడ్ ఇన్‌స్పెక్టర్ షంషీర్ ఖాన్ మరియు డాక్టర్ హరిత వారికి తెలియజేశారు.

# పలమనేరు ప్రాంత వాసులచే నిర్మించిన "వృషభ" చిత్రాన్ని ఆదరించండి



**పలమనేరు పెన్ పవర్ ఏప్రిల్ 03 :** పలమనేరు ప్రాంత వాసులచే నిర్మించిన "వృషభ" చిత్రాన్ని ఆదరించాలని ఆ చిత్ర నిర్మాత ఉమాశంకర్ రెడ్డి కోరారు.బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పలమనేరు రూరల్ నక్కపల్లె గ్రామానికి చెందిన జీవన్ రెడ్డి హీరోగా,అదే గ్రామానికి చెందిన ఉమాశంకర్ రెడ్డి అను నేను చిత్ర నిర్మాత,కథ,మాటలు తదితర బాధ్యతలు నిర్వహించానన్నారు. అలాగే పట్టణానికి చెందిన అశ్విన్ కామరాజు డైరెక్షన్ బాధ్యతలు చేపట్టి పలమనేరుతో బాటు చుట్టుపక్కల గ్రామాల్లోని అందమైన ప్రదేశాలతో బాటు ఎన్నో ప్రాంతాల్లో షూటింగ్ నిర్వహించామన్నారు.ఇందులో నియోజకవర్గానికి చెందిన సంకేతిక,నిపుణులు నటీనటులతో బాటు ప్రముఖ నటులు కూడా నటించారన్నారు. కాగా అన్ని సాంకేతిక కార్యక్రమాలను పూర్తి చేసుకుని ఏప్రిల్ 04వ తేదీ గురువారం రెండు రాష్ట్రాల్లోని దాదాపు చాలా థియేటర్లలో విడుదలై ప్రేక్షకుల ముందుకు రానున్నదని తెలిపారు.కావున స్థానికులచే నిర్మించిన ఈ సినిమాను నియోజకవర్గ ప్రజలతో బాటు తెలుగు రాష్ట్రాల్లోని ప్రజలందరూ చూసి సినిమాను ఆదరించి తమ చిత్ర బృందానికి గొప్ప విజయాన్ని అందించాలని ఆయన కోరారు.


# కడప పురుషుల, మహిళల కేంద్ర కారాగారం ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్‌ల తనిఖీ





**కడప పెన్ పవర్ రాయలసీమ కోఆర్డినేటర్ ఏప్రిల్ 3 :** జి. శ్రీదేవి, అధ్యక్షులు మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప వారి సూచనల మేరకు ఎస్.బాబా ఫక్రుద్దీన్, సెక్రటరీ–మరియు–సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప వారు కడప పురుషుల కేంద్ర కారాగారము మరియు మహిళల కారాగారామును, ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్‌లను విజిట్ / తనిఖీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలను, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు, ఉచిత న్యాయ సహాయమును సద్వినియోగం చేసుకోవాలి, మానసిక వ్యాధిగ్రస్తులైన ఖైదీలతో మాట్లాడడం జరిగినది, సకాలంలో డాక్టర్ సలహాలు తీసుకుంటూ మందులు వాడాలి, అనంతరం జైలు పరిసరాలను, టాయిలెట్లను, వసతి గదులను, రిజిస్టర్లను పరిశీలించి తగు సూచనలను సలహాలను ఇవ్వడం జరిగినది, ఫిర్యాదుల పెట్టెను పరిశీలించడం జరిగినది, ప్రిజం లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రాధాన్యతను తెలియజేశారు, జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయం, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టము మొదలగు అంశాలను వివరించారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100పై ప్రచారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పురుషుల కేంద్ర కారాగారం సూపరిండెంట్, మహిళ కారాగారపు సూపరిండెంట్, డాక్టర్లు, లీగల్ వాలంటరీలు మరియు ఖైదీలు పాల్గొన్నారు.

# ఏపీలో ముస్లిం విద్యార్థులు.. కార్పొరేట్ కాలేజీల్లో ఉచితంగా చదువుకోవచ్చు..



**కడప పెన్ పవర్ రాయలసీమ కోఆర్డినేటర్ ఏప్రిల్ 3 :** ఏపీ ముస్లిం విద్యార్థులకు ఉచిత విద్యా పథకం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముస్లిం విద్యార్థులకు ఒక కొత్త పథకాన్ని తీసుకురానుంది. ముస్లిం విద్యార్థులు కార్పొరేట్ కాలేజీల్లో ఇంటర్మీడియట్‌తో పాటుగా JEE, NEET కోచింగ్ ఉచితంగా చదువుకుంటారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచే ఈ పథకం అమలు చేయనున్నరు. ఆంధ్రప్రదేశ్ వక్ఫ్ బోర్డు సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ ఏడాది పదో తరగతి పాసైన విద్యార్థులకు ఒక టాలెంట్ టెస్ట్ నిర్వహించి. అందులో మంచి మార్కులు వచ్చిన విద్యార్థులను ఎంపిక చేసి.. వారికి నచ్చిన కార్పొరేట్ కాలేజీలో ఇంటర్మీడియట్ చదివే అవకాశం కల్పిస్తారు. వారికి JEE, NEET కోచింగ్ కూడా ఉచితంగా ఇస్తారు.. ఆ ఖర్చు మొత్తాన్ని వక్ఫ్ బోర్డు భరిస్తుంది. దీనికి సంబంధించి కాలేజీల యాజమాన్యాలతో ఇప్పటికే అధికారులు మాట్లాడారు. ఈ పథకాన్ని వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రారంభిస్తారు.. ప్రభుత్వం నిర్వహించే టాలెంట్ టెస్ట్‌లో మంచి మార్కులు తెచ్చుకుంటే చాలు.. కార్పొరేటర్ కాలేజీల్లో ఉచితంగా చదువుకునే అవకాశం లభిస్తుంది.

# ఓర్వకల్లు విమానాశ్రయంలో అవసరాల

## - జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య





**కర్నూలు, పెన్ పవర్ రాయలసీమ కోఆర్డినేటర్ మార్చి 3 :** కర్నూలు జిల్లా ఓర్వకల్లు ఎయిర్పోర్ట్ లో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని జాయింట్ కలెక్టర్ బి.నవ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ లోని మిని కాన్ఫరెన్స్ హాలులో ఏరోడ్రోమ్ కమిటీ, ఎయిర్ ఫీల్డ్ ఎన్విరాన్మెంట్ కమిటీ సమావేశాన్ని జాయింట్ కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఓర్వకల్లు ఎయిర్పోర్ట్ లో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా అన్ని చర్యలు తీసుకోవాలని ఏర్పోర్ట్ డైరెక్టర్ విద్యా సాగర్‌ను ఆదేశించారు. ఎయిర్పోర్ట్ ఆవరణంలో పచ్చదనాన్ని గణనీయంగా పెంచే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

అందులో పండ్లను ఇచ్చే చెట్లు లేకుండా చూడాలని కోరారు. జిల్లా అధికారులు అందరూ ఓర్వకల్లు ఎయిర్పోర్ట్‌కు అన్ని విధాల సహాయ సహకారాలు అందించాలని జాయింట్ కలెక్టర్ కోరారు. ఎయిర్పోర్ట్‌లోని చెత్తను గతంలో లాగా డంప్ యార్డు ప్రాంతాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఓర్వకల్లు ఎంపీడీవో కు సూచించారు. ఈ సందర్భంగా ఎయిర్పోర్ట్ డైరెక్టర్ విద్యాసాగర్ మాట్లాడుతూ 2024 సంవత్సరంలో ఏర్పోర్ట్ నందు యాంటీ హైజాక్ మరియు బాంబు బెదిరింపునకు చెందిన మాక్ డ్రిల్ నిర్వహించుకున్నామని జాయింట్ కలెక్టర్ కు తెలియజేశారు. ఈ సమావేశానికి ఎయిర్పోర్ట్ డైరెక్టర్ విద్యాసాగర్, డి ఎం అండ్ హెచ్ ఓ శాంతి కల, కర్నూలు డిఎస్‌పి బాబు ప్రసాద్, ఐబి డిఎస్‌పి మధు, ఆర్టీసీ ఆర్ఎం శ్రీనివాసులు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కిషోర్ రెడ్డి, డిడి మైన్స్ రవిచంద్ర, ఎలక్ట్రికల్ డిఈ శేషాద్రి, ఎంపీడీవో శ్రీనివాసులు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# చలో ఢిల్లీ జయప్రదం చేయండి : జయవర్ధన్





**కడప జిల్లా పెన్ పవర్ రాయలసీమ కోఆర్డినేటర్ ఏప్రిల్ 3 :** దేశంలో పెరిగిపోతున్న నిత్యవసర ధరలు తగ్గించాలని, రోజు రోజుకి పెరిగిపోతున్న నిరుద్యోగ సమస్య పరిష్కరించాలని తదితర డిమాండ్ల పైన ఈ నెల 11వ తేదీన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ ఆధ్వర్యంలో పిలుపునిస్తున్నట్లు చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జయవర్ధన్, అఖిల భారత అగ్రగామి మహిళా సమితి రాష్ట్ర అధ్యక్షురాలు సుబ్బమ్మ పిలుపునిచ్చారు. గురువారం కడప నగరంలోని ఓంశాంతి నగర్‌లో నెలకొని ఉన్న ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ కార్యాలయం నందు చలో ఢిల్లీకి సంబంధించిన పోస్టర్లు విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... దేశంలో రోజు రోజుకి నిత్యావసర ధరలు పెరిగిపోతున్నాయని దీనివల్ల పేద బడుగు బలహీన వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వారు తెలిపారు. అంతేకాకుండా నిరుద్యోగ సమస్య తీర్చకుండా దేశ అభివృద్ధి సాధించాలంటే ఏవిధంగా అభివృద్ధి అవుతుందని వారు ప్రశ్నించారు. నూతన జాతీయ విద్యా విధానంని రద్దు చేయకుండా కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యను పూర్తిగా పేద ప్రజలకు అందని ద్రాక్షలా చేస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పునర్ విభజన చట్టంలోని ప్రత్యేక హోదా అంశాన్ని పూర్తిగా కేంద్ర ప్రభుత్వం మరిచిపోయిందని, ప్రత్యేక హోదా వస్తే దేశంలో పెట్టుబడులు ఆర్థిక అభివృద్ధి పురోగతి సాధిస్తుందని కానీ అటువంటి ప్రయత్నాలు పక్కనపెట్టి కేవలం ఆంధ్రప్రదేశ్‌పై కపట ప్రేమ చూపించడం దారుణం అన్నారు. అదేవిధంగా పునర్విభజన చట్టంలోనే కడప ఉక్కు పరిశ్రమ పై పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని, కడప ఉక్కు పరిశ్రమ ఏర్పడితే రాయలసీమ జిల్లాల్లోని అనేకమంది నిరుద్యోగులకు ప్రత్యక్షంగాను పరోక్షంగాను ఉపాధి అవకాశాలు దక్కుతాయని కానీ అటువంటి ప్రయత్నాలు చేయకుండా తమ యొక్క స్వార్ధ లాభ ప్రయోజనాల కోసం ప్రాకులాడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కుల మతతత్వ రాజకీయాలు బిజెపి ప్రభుత్వం పెంచి పోషిస్తుందని అంటేనే నరేంద్ర మోడీ మతతత్వ రాజకీయాలకు స్వస్తి పలకాలని వారు హితవు పలికారు. అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 11న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని పిలుపునిస్తున్నట్లు ప్రజలు నిరుద్యోగులు యువకులు పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో అఖిల భారత విద్యార్థి బ్లాక్ రాయలసీమ కన్వీనర్ తగిలి రాజేంద్రప్రసాద్ అఖిలభారతగ్గరగామి మహిళా సమితి రాష్ట్ర కార్యదర్శి అరుణకుమారి, మహిళలు కీర్తన, విజయ, ధనలక్ష్మి, అంజలి తదితరులు పాల్గొన్నారు.

# బిజెపిలోకి డాక్టర్ శివానాయక్





**కడప పెన్ పవర్ రాయలసీమ కోఆర్డినేటర్ ఏప్రిల్ 3 :** వైసిపి డాక్టర్స్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఐ శివా నాయక్ బిజెపిలో చేరారు. బుధవారం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి వై సత్య కుమార్ యాదవ్ సమక్షంలో పెద్ద సంఖ్యలో బంజారాలతో కలిసి కండువా కప్పుకున్నారు. కడప జిల్లా అధ్యక్షులు జంగిటి వెంకట సుబ్బారెడ్డి గారి ప్రమాణ స్వీకారం మహోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వర్యులు సత్య కుమార్, జమ్మలమడుగు నియోజకవర్గం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆదినారాయణ రెడ్డి , ఏపీ మార్క్ ఫెడ్ డైరెక్టర్ శశిభూషణ్ రెడ్డి సమక్షంలో భారతీయ జనతాపార్టీ లో చేరారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యదర్శి బాలకృష్ణ యాదవ్ , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లక్ష్మి నారాయణ రెడ్డి, విశ్వహిందూ పరిషత్ సమ్మిరెడ్డి కృష్ణారెడ్డి హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఏపీ అండ్ తెలంగాణ రీజినల్ డైరెక్టర్, పోతుగుంట రమేష్ నాయుడు, జనసేన కడప జిల్లా అధ్యక్షులు సుంకర శ్రీనివాసులు, టీడీపీ నాయకులు హరి ప్రసాద్, బద్వేల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జ రోషన్న, సింగారెడ్డి రామచంద్రారెడ్డి, జనసేన నాయకులు రంజిత్ , వేణు, రమణ, ఎన్డీఏకూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సత్య కుమార్ యాదవ్‌కు తెలిపిన విశ్వ హిందూ పరిషత్ కడప జిల్లా ప్రసార ప్రచార సహ ప్రముఖ్,పెన్ పవర్ రాయలసీమ కోఆర్డినేటర్ సమ్మిరెడ్డి కృష్ణారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

# వైఎస్.షర్మిలను కలిసిన గూడూరు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం.డి.గౌస్ బాష



**గూడూరు, పెన్ పవర్, ఏప్రిల్ 03 :** కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను గూడూరు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం.డి. గౌస్ బాష విజయవాడలోని పార్టీ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా గౌస్ బాష మాట్లాడుతూ పార్టీ బలోపేతం, ముందున్న ఎన్నికల వ్యూహాలు, ప్రజా సమస్యలపై చర్చ జరిగిందని అన్నారు. ఎంపికల వ్యూహాలను మరింత సమర్ధవంతంగా అమలు చేయడంపై కూడా చర్చ జరిగినట్లు సమాచారం. సమావేశంలో నాయకుల ఫయాజ్, ఖలీల్, పర్వతాల శ్రీను,ఇతర ప్రముఖ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. షర్మిల నాయకత్వంలో పార్టీని మరింత బలోపేతం చేయాలని గౌస్ బాష ఆకాంక్షించారు. ఈ సమావేశం పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపిందని కార్యకర్తలు తెలిపారు.

# డిఎండబ్ల్యూ-సిఎస్ఆర్ నిధులతో ఎస్కెఆర్ ప్రభుత్వ జూనియర్ కాలేజ్‌కు 10 కంప్యూటర్లు అందజేత



**గూడూరు, పెన్ పవర్, మార్చి 3 :** ప్రముఖ ప్రైవేట్ సంస్థ డిఎండబ్ల్యూ తమ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్) నిధుల ద్వారా సుమారు 3 లక్షల రూపాయలు వెచ్చించి 10 కంప్యూటర్లను ఎస్కెఆర్ ప్రభుత్వ జూనియర్ కాలేజ్ యాజమాన్యానికి అందజేసింది. ఈ కార్యక్రమం క్యాంప్ కార్యాలయం వద్ద నిర్వహించబడింది. కంప్యూటర్లను గూడూరు శాసన సభ్యులు డాక్టర్ పాశిం సునీల్ కుమార్ కాలేజ్ యాజమాన్యానికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సాంకేతిక విద్యను ప్రోత్సహించేందుకు ఇటువంటి సంస్థల భాగస్వామ్యం అభినందనీయమని తెలిపారు. విద్యార్థులకు ఆధునిక సౌకర్యాలు అందించడంలో ప్రైవేట్ సంస్థలు సహకరించాలన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రహీం,పులిమి శ్రీనివాసులు, అరుణ్ కుమార్, కాలేజ్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## గూడూరు ఆదిశంకర కాలేజీలో

# విద్యార్థి అనుమానాస్పద మృతి



**గూడూరు, పెన్ పవర్, ఏప్రిల్ 03 :** గూడూరు సమీపంలోని ఆదిశంకర ఇంజనీరింగ్ కాలేజీలో మరో విషాదం చోటుచేసుకుంది. నెల్లూరు జిల్లా మనుబోలు గ్రామానికి చెందిన జస్వంత్ సాయి (ఎంటెక్,ద్వితీయ సంవత్సరం) అనుమానాస్పదంగా మృతి చెందాడు. కాలేజీ యాజమాన్యం అతను బిల్డింగ్‌పై నుంచి దూకేశాడని చెబుతుండగా, తల్లిదండ్రులు తమ కుమారుడు హత్యకు గురయ్యాడని ఆరోపిస్తున్నారు. క్యాంపస్‌లో గ్యాంగ్‌వార్లు, మత్తుపదార్థాల వినియోగం పెరుగుతోందన్న ఆరోపణల మధ్య ఈ ఘటన విద్యార్థుల్లో భయాందోళన కలిగిస్తోంది. గతంలోనూ ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడంతో కాలేజీ నిర్వాహనంపై కొత్త అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జస్వంత్ మృతిపై పోలీసులు దర్యాప్తు చేపట్టి నిజానిజాలు వెలికితీయాల్సిన అవసరం ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

# శ్రీకాళహస్తిలో వ్యభిచారం గుట్టురట్టు

**శ్రీకాళహస్తి, పెన్‌పవర్, ప్రతినిధి, ఏప్రిల్ 3 :** శ్రీకాళహస్తిలో గురువారం వ్యభిచారం నిర్వహిస్తున్న ఓ లాడ్జిపై పోలీసులు మెరుపు దాడులు నిర్వహించారు. పట్టణంలోని తేరు వీధి సూపర్ బజార్ కూడలి వద్ద ఓ లాడ్జిలో వ్యభిచారం నిర్వహిస్తున్నారన్న పక్కా సమాచారం మేరకు వన్ టౌన్ పోలీసులు ఈ దాడులు చేశారు.ఇందులో భాగంగా ఐదుగురు అమ్మాయిలు, ఇద్దరు విటులను అదుపులోకి తీసుకున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# మాజీ మంత్రి కాకాణి పై అక్రమ కేసులు ఎత్తివేయాలి

- రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగ నడుస్తుంది - అక్రమ కేసులకు భయపడం, ప్రజా సమస్యలపై పోరాటం సాగిస్తాం

- మైనింగ్ మాఫియా కు కాపలాదారులుగా పోలీసులు,మైనింగ్ అధికారులు - జగనన్నకు జనం నీరాజనాలు - మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య



**నాయుడుపేట, పెన్ పవర్ ప్రతినిధి, ఏప్రిల్ 3 :** మాజీ మంత్రి,నెల్లూరు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాకాని గోవర్ధన్ రెడ్డి పై కూటమి ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య డిమాండ్ చేశారు. గురువారం నాయుడుపేట పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తొమ్మిది నెలల కూటమి ప్రభుత్వ పాలనలో విద్యా,వైద్యం, వ్యవసాయం,ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసి మాజీ సీఎం జగన్ ను అవమానపరుస్తూ, వైసిపి నాయకులను కూటమి ప్రభుత్వం టార్గెట్ చేస్తూ అక్రమ కేసులు బనాయిస్తుందని అన్నారు. రాష్ట్రంతో పాటు నియోజకవర్గంలో పోలీసు మైనింగ్ అధికారులు ఇసకా మట్టి గ్రావెల్ మైనింగ్ మాఫియాకు కాపరదారులుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. మాజీ సీఎం జగన్ ఆదేశానుసారం ప్రజా సమస్యలపై గొంతుకు వినిపిస్తున్న మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి పై అక్రమ కేసులు బనాయించడం అన్యాయమన్నారు. ఎన్నికల కౌంటింగ్ పూర్తయిన నాటి రాత్రి నుండే కూటమి నాయకులు మైనింగ్ దోపిడీ మొదలు పెట్టారని ఆరోపించారు. కూటమి నాయకులు ఇసుక మట్టి గ్రావెల్ లను అక్రమంగా తరలించి అంజని కాడికి దోచుకుంటున్నారని విమర్శించారు. రాష్ట్రంలో లిక్కర్ ఏటీఎం నడుస్తుందన్నారు. లిక్కర్ సిండికేట్ ద్వారా లక్షలు దోచుకుంటున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యేలు నందిని కాడికి దోచుకుంటూ,సంపాదన ధ్యేయంగా పనిచేస్తూ, ప్రజా సంక్షేమం గాలికి వదిలేసారని విమర్శించారు. సూపర్ సిక్స్ పథకాలలో పెన్షన్ పంపిణీ తప్ప మరి హామీ అమలు కాలేదు అన్నారు. సంపద సృష్టించి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్న చంద్రబాబు అమ్మ ఒడి తల్లికి వందనం పథకాలు అమలు చేయలేకపోతున్నారని అన్నారు. వైసిపి నాయకులపై అక్రమ కేసులు పెట్టి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న చంద్రబాబుకు 2027లో జెమిలి ఎన్నికలు జరిగితే గుణపాఠం తప్పుతున్నారు. మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి పై పెట్టిన అక్రమ కేసులు ఎత్తేసే వరకు పోరాటం సాగిస్తామన్నారు. కూటమి ప్రభుత్వం తమపై ఎన్ని అక్రమ కేసులు బనాయించినా మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో పోరాడడానికి సిద్ధంగా ఉన్నామని తెలియజేశారు. తొమ్మిది నెలల కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజా వ్యతిరేకత చోటు చేసుకోవడంతో జగన్కు ప్రజలు నీరాజనం పలుకుతున్నారని అన్నారు. ప్రజలకు సేవ చేయడం మానేసి దోపిడీలు,దౌర్జన్యాలు, వైసీపీ నాయకులపై అక్రమ కేసులు బనాయించడమే పనిగా రాష్ట్ర పాలన సాగుతుందన్నారు. త్వరలో బెల్ట్ షాపుల పై పోరాటం ప్రారంభమవుతుందన్నారు. ప్రజల పక్షాన నిలబడి కార్యక్రమాలు చేపడతామని తెలియజేశారు. ఈ సమావేశంలో మాజీ ఎన్డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, నాయుడుపేట మున్సిపల్ చైర్పర్సన్ కటకం దీపిక, మున్సిపల్ వైస్ చైర్మన్ జలదంకి వెంకటకృష్ణారెడ్డి, నాయుడుపేట ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మి, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు తంబిరెడ్డి సుబ్రమణ్యం రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ తంబిరెడ్డి జనార్ధన్ రెడ్డి, నాయుడుపేట మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఒట్టూరు కిషోర్ యాదవ్, పట్టణ పార్టీ అధ్యక్షులు కలికి మాధవరెడ్డి, మాజీ ఏఎంసి వైస్ చైర్మన్ కట్టా కమలాకర్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు ధారా రవి, పాలేటి నాగార్జున, నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షులు షేక్ షబ్బీర్, కావేరి పాకం అశోక్ కుమార్, నియోజకవర్గ వైసిపి మహిళా అధ్యక్షురాలు ఈదా రత్నశ్రీ, ఓజిలి మండల పార్టీ అధ్యక్షులు పాదర్తి హరినాథ్ రెడ్డి, వైసిపి నాయకులు పేర్నాటి రాహుల్, షేక్ రహంతుల్లా, మెస్ భాస్కర్ రెడ్డి, దక్కిలి కృష్ణయ్య,గోవా మాధవయ్య, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## అలిపిరి టోల్ గేట్‌ను ఆకస్మికంగా తనిఖీ



(3వ పేజీ తరువాయి) వస్తున్న స్కానింగ్ ను నిశ్చింతగా పరిశీలించి.. విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలిపిరి వద్ద ఉన్న సిసి కెమెరాను పరిశీలించి.. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కే రవి మనోహర్ ఆచారి అదనపు ఎస్పీ శాంతి భద్రతలు, సదాలక్ష్మి వివిఎస్ఓ, రమేష్ కృష్ణన్ ఏవి అండ్ ఎస్ఓ, పురుషోత్తం, విఐ, రామకృష్ణ ఎస్ విఎఫ్ ఆర్ఐ, శ్రీలత డిఎస్పి మహిళ, తిరుపతి టౌన్, సుబ్రహ్మణ్యం సి.ఐ.డి.సి.ఆర్. బి, సాధిక్ ఆలి సీ.ఐ. టీటీడీ విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

## కాణిపాకం స్వామివారిని దర్శించుకున్న ఐ.ఆర్.ఎస్ అధికారులు చైతన్య కృష్ణ, హర్షిత



**కాణిపాకం/పెన్ పవర్/ఏప్రిల్ 3 :** గణనాధుని సేవలో ఇద్దరు ఐ.ఆర్.ఎస్.అధికారులు చైతన్య కృష్ణ, హర్షిత. కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారిని దర్శించుకున్న ఇద్దరు ఐ.ఆర్.ఎస్ అధికారులు చైతన్య కృష్ణ, హర్షిత, దంపతులు కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. వీరికి స్వాగతం పలికి దర్శన ఏర్పాటు చేసి స్వామి వారి తీర్థ ప్రసాదాలు శేషవస్త్రం చిత్రపటాన్ని అందజేసిన దేవస్థానం ఈ.వో పెంచల కిషోర్, ఈ కార్యక్రమంలో సూపరిడెంట్ వాసు, టెంపుల్ ఇన్స్పెక్టర్ బాలాజీ నాయుడు, తదితరులు ఉన్నారు.

## చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య



**శ్రీ కాళహస్తి, పెన్ పవర్, ప్రతినిధి, ఏప్రిల్ 3 :** శ్రీకాళహస్తి మండలం తొండమనాడుపేటలో ఒకరు ఆత్మహత్యకు పాల్పడ్డారు. వ్యవసాయ పొలాల్లో చెట్టుకు మృత దేహం వేలాడుతుండగా స్థానికులు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు బత్తిరెడ్డిగా (67) పోలీసులు గుర్తించారు. మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

## బసవయ్యపాలెంలో కబ్జాలు అరికట్టండి : సీపీఐ



**శ్రీకాళహస్తి, పెన్ పవర్ ప్రతినిధి, ఏప్రిల్ 3 :** తొట్టంబేడు పంచాయతీ బసవయ్య పాలెంలో ప్రభుత్వ భూమిలో కడుతున్న అక్రమ కట్టడాలను అడ్డుకోవాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. శ్రీకాళహస్తి పట్టణానికి సమీపంలోని ఈ భూములు అధిక ధర పలుకుతుండటంతో కబ్జా చేస్తున్నారని చెప్పారు. అధికారులు వీటిని అరికట్టకపోతే తామే స్థలాన్ని స్వాధీనం చేసుకుని పేద ప్రజలకు పంపిణీ చేస్తామని హెచ్చరించారు.

## వివాహ వేడుకలో రాజంపేట ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి ఆకేపాటి





**రాజంపేట పెన్ పవర్ రాయలసీమ కోఆర్డినేటర్ ఏప్రిల్ 3 :** రాజంపేట టౌన్‌లి పెనగలూరు మండలం బేస్తపల్లి గ్రామానికీ చెందిన ఓబుల్ రెడ్డి వారి కుమారుని వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు వైఎస్ఆర్సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు మరియు రాజంపేట శాసనసభ్యులు ఆకేపాటీ అమర్ నాథ్ రెడ్డి మరియు రాజంపేట జడ్పీటీసీ దాసరి పెంచలయ్య, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ దండు గోపి, సుబ్బరాజు, చక్రంపేట మాజి సర్పంచ్ ఆంజనేయులు, సిద్దవరం శ్రీనివసులు రెడ్డి పలువూరు పాల్గొన్నారు.

## జొన్నలు మద్దతు ధరకు కొనుగోలు కేంద్రాలు : కలెక్టర్ సి.విష్ణు చరణ్



**నంద్యాల పెన్ పవర్ ఏప్రిల్ :** జొన్నలు–హైబ్రిడ్ రకము (సి43/మహేంద్ర రకము)ప్రభుత్వ కనీస మద్దత్తు ధరకు కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేసినట్లు జాయింట్ కలెక్టర్ సి విష్ణు చరణ్ తెలిపారు. ప్రస్తుతము జొన్నలు కనీస మద్దత్తు ధర క్వింటాలుకి రూ.3,371/– రైతులందరు జొన్నలను పౌర సరఫరాల సంస్థ ద్వార ప్రభుత్వ కనీస మద్దత్తు ధరకు విక్రయించాల న్నారు. 01.04.2025 న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ ఇచ్చిన సర్క్యులర్ ఆదేశాల ప్రకారం నంద్యాల జిల్లాలో పండించిన జొన్నలు అయిన హైబ్రిడ్ రకము అయిన (సి43/మహేంద్ర రకము), జొన్నలను ప్రభుత్వ కనీస మద్దతు ధరకు రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయుటకు ఆదేశాలు జారీ చేయడం జరిగినదన్నారు. రైతులందరు తమ సమీప రైతు సేవా కేంద్రాల నందు e-crop మరియు e-kyc తో పాటు తమ పేర్లను నమోదు చేయించుకావాలన్నారు.. e-crop మరియు e-kycతో పాటు తమ పేర్లను నమోదు చేయించుకున్న రైతులు మాత్రమే కొనుగోలుకు అర్హులనీ తెలిపారు. జిల్లాలోని రైతు లందరికీ తెలియచేయడం ఏమనగా, రైతులు తాము పండించిన జొన్నలను ప్రభుత్వం నిర్ణయించినటువంటి కనీస మద్ధతు ధర క్వింటాకు రూ.3,371/– చొప్పున ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలకు లోబడి కొనుగోలు జరపాలన్నారు. హమాలీలను రైతులే ఏర్పాటు చేసుకుంటే హమాలీ ఖర్చులను ప్రభుత్వమే అదనంగా ఇస్తుందన్నారు. గోనే సంచులను మరియు జొన్నలను రవాణా చేయుటకు గల రవాణా ఖర్చులను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ భరిస్తుందన్నారు. కొనుగోలు చేసిన వెంటేనే ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర మొత్తాన్ని రైతుల బ్యాంక్ ఖాతాలో నేరుగా జమచేయడం జరుగుతుందన్నారు. కావున ఈ అవకాశాన్ని జిల్లాలోని రైతులందరూ సద్వినియోగం చేసుకోవలసినదిగా జిల్లా జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్ తెలిపారు.

## ఉపాధి హామీ పథకంలో ఎక్కువ పని దినాలు

### – జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్

**అనంతపురం పెన్ పవర్ ఏప్రిల్ 3 :** ఉపాధి హామీ పథకం కింద 2025–26 ఆర్థిక సంవత్సరంలో 1 కోటి 20 లక్షల పనిదినాలు కల్పించనున్నామని కలెక్టర్ డాక్టర్ వినోద్ తెలిపారు. రూ.375 కోట్లను వేతనాల రూపంలో చెల్లించేందుకు లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామన్నారు. 2024–25 లో జిల్లాలో 2.12 లక్షల కుటుంబాలకు 109.25 లక్షల పనిదినాలు కల్పించి, రూ. 287.01 కోట్లను వేతనాల రూపంలో ఉపాధి కూలీలకు చెల్లించాలన్నారు. ఈ సందర్భంగా ప్రెస్ మీట్‌లో జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి మాట్లాడారు. అనంతపురం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో 2024–25వ ఆర్థిక సంవత్సరంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో సాధించిన ప్రగతి మరియు 2025–26వ ఆర్థిక సంవత్సరంలో చేపట్టబోయే పనులపై జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాది హామీ పథకం విజయవంతంగా అమలు చేయడం ద్వారా మరియు కూలీలకు ఉపాధి, గ్రామీణ ప్రాంతాలలో మౌళిక సదుపాయాల కల్పన మరియు సుస్థిర ఆస్తుల అభివృద్ధికి చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు.

ఈ పథకం మౌళిక సదుపాయాల కల్పన మరియు సుస్థిరమైన ఆస్తుల ఏర్పాటుకు ఒక వరంలాంటిదన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో సాధించిన ప్రగతికి సంబంధించి జిల్లాలో 2.12 లక్షల కుటుంబాలకు 109.25 లక్షల పనిదినాలు కల్పించి, 287.01 కోట్ల రూపాయలను వేతనాల రూపంలో ఉపాధి కూలీలకు చెల్లించడం జరిగిందని తెలిపారు. ఉపాధి హామీ పథకం కింద నీటి నిల్వ మరియు సంరక్షణ పనుల కింద 238 చెరువుల యందు పూడిక తీత పనులు, 575 సేద్యపు నీటి కుంటలు, 1,276 కొండల యందు నీటి నిల్వ కందకాలు, 2,347 డగ్ అవుట్ పాండ్స్, 374 పంట కాలువలలో పూడిక తీత పనులు చేపట్టామన్నారు. మౌలిక వసతులకు సంబంధించి 194.57 కిలోమీటర్ల సిసి రోడ్లను 73 కోట్ల 86 లక్షల 18 వేల రూపాయలతో, 10.39 కిలోమీటర్ల బిటి రోడ్లను 4 కోట్ల 85 లక్షల 60 వేల రూపాయలతో, 7.25 కిలోమీటర్ల సిసి డ్రైన్స్ ను మూడు కోట్ల 93 లక్షల 60 వేల రూపాయలతో, 1,437 పశువుల షెడ్లను 29 కోట్ల 16 లక్షల 90 వేల రూపాయలతో చేపట్టడం జరిగిందని తెలిపారు. పశువుల షెడ్లకు సంబంధించి రాష్ట్రంలో అనంతపురం జిల్లా రెండవ స్థానంలో ఉందన్నారు. జిల్లాలో గత సంవత్సరం పూర్తి చేసిన నీటి నిల్వ మరియు సంరక్షణ పనుల ద్వారా 1.74 టిఎంసిల నీటిని భూగర్భ జలాలుగా పెంపొందించడం జరిగిందన్నారు. ఉద్యాన పంటలకు సంబంధించి 8051.94 ఎకరాలలో (3220. 77 హె.) విస్తీర్ణములో ఉద్యాన పంటలలో వివిధ రకాలైన మామిడి, దానిమ్మ, బత్తాయి, జామ, నేరేడు మొదలగు పండ్ల తోటల పెంపకము చేపట్టడం జరిగిందన్నారు. 2025–26 ఆర్థిక సంవత్సరంలో 120.00 లక్షల పనిదినాలు కల్పించి 375.00 కోట్ల రూపాయలు వేతనాల రూపంలో చెల్లించడానికి లక్ష్యముగా నిర్దేశించుకున్నామన్నారు. 2025–26 మొదటి త్రైమాసికములో భాగంగా ఏప్రిల్ నెలకు 24.62 లక్షల పనిదినాలు, మే నెలకు 32.59 లక్షలు, జూన్ నెలకు 10.79 లక్షల పనిదినాలు కలిపి మొత్తం 68.00 లక్షల పనిదినాలు పూర్తి చేసేందుకు లక్ష్యముగా నిర్దేశించామన్నారు. అలాగే 8,000 ఎకరాలలో పండ్లతోటల పెంపకము చేపట్టనున్నామన్నారు. ఉపాధి హామీ కింద పనులు జరుగుతున్న ప్రాంతంలో కూలీలకు అవసరమైన నీడ ఏర్పాటు, తాగునీటి సౌకర్యం, మజ్జిగ అందించడం, ఫస్ట్ ఎయిడ్ కిట్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఉద్యాన పంటలకు సంబంధించి ఉపాధి హామీ, ఎమ్ఐడిహెచ్ (ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ ఆఫ్ హార్టికల్చర్) పథకాలు ఉన్నాయని, దాని కింద 1,500 హెక్టార్లలో ఉద్యాన పంటలను క్రాప్ సబ్సిడీ, ప్లాంట్ మెటీరియల్ ఇస్తూ ప్రోత్సహిస్తున్నామన్నారు. 2025–26 ఆర్థిక సంవత్సరం లక్ష్యాలు మరియు కార్యాచరణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 646 పశువుల నీటితొట్టెల నిర్మాణాలు, 31 చెరువుల పునరుద్ధరణ పనులు, 9 వేల ఫారం పాండ్స్ నిర్మాణాలు, 93 కిలోమీటర్ల మేర సప్లై మరియు ఫీడర్ చానల్ యందు పూడిక తీత పనులు, సగటు వేతనంలను "పంచ ప్రాధాన్యతలు" గా నిర్దేశించుకొని రాబోవు మూడు మాసాలకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. సగటు వేతనం రూ.307/– పొందే విధంగా గ్రూప్ మార్కింగ్ ఇచ్చి పనులు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. నీటి నిల్వ మరియు భూసార సంరక్షణ పనులను చేపట్టి భూగర్భ జలాలు పెంపొందించేందుకు, రైతులకు సుస్థిర ఆదాయ వనరులను కల్పించుటలో భాగంగా పండ్లతోటల పెంపకం, మౌలిక వసతులలో భాగంగా సిసి రోడ్లు, బిటి రోడ్లు, సిసి డ్రైన్స్, పశువుల తొట్టెలు మొదలకు పనులు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. ఉపాధి హామీ పనులను జాబ్ కార్డుదారులు విరివిగా ఉపయోగించుకోవాలని, తద్వారా ఆదాయం పొందాలని సూచించారు. 2024–25 రబీకి గాను జిల్లాలో ఏడు మండలాలను కరువు మండలాలుగా ప్రభుత్వం ప్రకటించడం జరిగిందని, జిల్లాలో తీవ్ర ప్రభావిత ప్రాంతాలైన బెలుగుప్ప, గుంతకల్లు, పెద్దవడుగూరు, తాడిపత్రి, యల్లనూరు, యాడికి మండలాలు, మధ్యస్తంగా ప్రభావితమైన విడపనకల్లు మండలాలను కరువు మండలాలుగా ప్రకటించడం జరిగిందన్నారు. జిల్లాలో భూగర్భ జలం సరాసరిగా 13 మీటర్లలో ఉందని, దానిని రాష్ట్ర ముఖ్యమంత్రి సూచించిన విధంగా 8 మీటర్ల కన్నా తక్కువ తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇందులో ప్రజల భాగస్వామ్యం కూడా తప్పనిసరిగా ఉండాలని సూచించారు. ఈరోజు, రేపు అనంతపురం జిల్లాలో బలమైన గాలులు, ఉరుములు, మెరుపులు, వర్షం వచ్చే అవకాశం ఉందని వచ్చిన హెచ్చరికల నేపథ్యంలో జిల్లా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. ఈ ప్రెస్ మీట్‌లో డ్వామా పిడి సలీమ్ భాష, పీఆర్ ఎస్ఈ జహీర్ అస్లాం, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిదీ రాజకీయం చేయడం తోపు బ్రదర్స్ కి అలవాడుగా మారింది



**అనంతపురం, పెన్ పవర్ ఏప్రిల్ 3 :** ప్రతిదీ రాజకీయం చేయడం తోపు బ్రదర్స్ కి అలవాడు గా పెన్ పవర్ రాయలసీమ, కోఆర్డినేటర్ ఏప్రిల్ 3 : పాపంపేటలో 106 సర్వే నెంబర్‌లో 63 సెంట్లులో సుప్రీంకోర్టు ఆర్డర్‌తో ఇల్లు తొలగించారు. మా వాళ్ళు కూల్చి వేతను అడ్డుకునే ప్రయత్నం చేశారు. మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి రాజకీయం చేస్తున్నారు. కూల్చివేత ను తోపు బ్రదర్స్ ఎందుకు ఆపలేక పోతున్నారు. రూ.8 కోట్లు తీసుకున్నారు అని ఆరోపిస్తున్నారు... మా కుటుంబం పెట్టేది కానీ చేయి చాచే ది కాదు ప్రతిదీ రాజకీయం చేయడం తోపు బ్రదర్స్‌కి అలవాడుగా మారింది. టీవీ బాంబు గురుంచి మాట్లాడే వారు కారు బాంబు గుర్తుకు రాదా మీరు ముగ్గురు జైల్‌లో ఉండి వచ్చారు కదా... శుక్ర వారం జిల్లాకి జగన్ సూటుకేసు బాంబు గురుంచి చెప్పాలి. గతాన్ని అంతా ఈ ప్రాంతంలో మర్చిపోయారు. కక్కుముక్కల, గంగుల కుటుంబాల తో పాటు మేము తీవ్రంగా నష్టపోయాం. కష్టపడి పిల్లల్ని చదివించి పెద్ద చేసుకున్నాం. ప్రశాంతంగా ఉన్న సమయంలో మా మధ్య మళ్లీ ఫ్యాక్షన్ కి ఆజ్యం పోసేలా తోపు బ్రదర్స్ ప్రయత్నం చేస్తున్నారు. తోపు వారి ఉచ్చు లో గంగుల, కనుముక్కల కుటుంబాలు పడవద్దు అధికారంలో లేనప్పుడు కనుముక్కల, గంగుల కుటుంబాలు తోపు కుటుంబానికి గుర్తు వస్తాయి. అధికారంలో ఉన్నప్పుడు ఒక లా... లేనప్పుడు మరోలా వ్యవహరిస్తున్నారు. రెడ్డి సోదరులకి.. పరిటాల కుటుంబానికి ముందు నుంచి ఎలాంటి వివాదం లేదు వాళ్ళ రాజకీయాలకు మిమ్మల్ని వాడుకుంటున్నారు. వాళ్ళ రాజకీయ ఉచ్చులో ఎవరు పడవద్దు. గతం లో మా నాయకుడు చంద్రబాబు, లోకేష్ పై దుర్భాషలు ఆడిన తోపు సోదరుడు ఈ రోజు మరోలా మాట్లాడుతున్నారు. రామగిరి లో ఎంపీపీ అధ్యక్ష ఎన్నికను రాజకీయం చేస్తున్నారు. మేము మా నాయకుడి ఆదేశాల తో పోటీకి దూరంగా ఉన్నాం. వాళ్ళ పార్టీ వాళ్లనే కిడ్నాప్ చేసి డ్రామాలు ఆడారు.. చేతకాక మా పై నిందలు వేస్తూ డ్రామాలు ఆడుతున్నారు. లింగమయ్య మృతి దురదృష్టవశాత్తు జరిగింది. మా ఎంపీ, మంత్రిని పంపి భరోసా ఇచ్చాం. ఇప్పటి వరకు తోపు ఆ కుటుంబాన్ని ఎందుకు పరమర్శించలేదు. మాజీ సీఎం వస్తున్నారు అంట... లింగమయ్య ను పరామర్శించేందుకు జగన్మోహన్ రెడ్డి సూటుకేసు బాంబు గురించి, అనంతలో జరిగిన హత్యల గురించి చెప్పాలి. గాండ్లపర్తి మోహన్ రెడ్డి, తోపుదుర్తి మహేష్ కుటుంబాలను జగన్ పరమర్శించాలి. మీ ప్రభుత్వం లో మా నియోజకవర్గంలో చాలా మంది వైసీపీ వారు నష్ట పోయారు అందరినీ పరామర్శించాలి.

## భారతీయ జనతా పార్టీ బలోపేతానికి అందరూ గట్టి కృషి చేయాలి



**పొదిలి, పెన్ పవర్, ఏప్రిల్ 3 :** రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ మరింత బలోపేతానికి అందరూ గట్టి కృషి చేయాలని జిల్లా బిజెపి అధికార ప్రతినిధి బెల్లంకొండ విజయలక్ష్మి కోరారు గురువారం నాడు పట్టణంలోని బెల్లంకొండ నగర్ లో గల బిజెపి మండల కార్యాలయంలో కార్యకర్తల సమావేశం జరిగింది సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న విజయలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ తిరుగులేని శక్తిగా రూపొందించే విధంగా నాయకులు కార్యకర్తలు అహర్నిశలు శ్రమించాలన్నారు రాష్ట్ర బిజెపి అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఆదేశాల మేరకు ఈనెల ఆరవ తేదీన బిజెపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించుకోవాలని ఆమె చెప్పారు అలాగే పార్టీ అభివృద్ధి కోసం అవసరమైన చర్యల గురించి ఆమె సమావేశంలో వివరించారు అనంతరం భారతీయ జనతా పార్టీ సిద్ధాంతాలు, భావాలు కు ఆకర్షితులై పార్టీలో చేరేందుకు ముందుకొచ్చిన షేక్ మహమ్మద్ అనే యువకుడిని ఆమె పార్టీ కండువా కప్పి, సాదరంగా ఆహ్వానించారు .

## ఆలయంలో "సెల్" హల్ చల్...

### దళారులకు ప్రత్యేక అనుమతి.... విలేఖరులకు మాత్రం నిబంధనలు... పక్షపాతంగా భద్రతా నిబ్బంది...




**శ్రీకాళహస్తి, పెన్ పవర్, ప్రతి నిధి, ఏప్రిల్ 3 :** అయిన వారికి ఆకుల్లో కాని వారికి కంచాల్లో" అనే సామెతను శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం వారు బాగా వంట పట్టించుకున్నారు. ఒక్కొక్కరికి ఒక్కో విధానాన్ని అవలంబిస్తున్నారు. కొందరికి మాత్రమే నిబంధనలు, మరికొందరికి ఎటువంటి ఆంక్షలు లేవు. భద్రత దృష్ట్యా ఆలయంలోకి సెల్ఫోన్లను అనుమతించేది లేదని అధికారులు నిబంధన పెట్టారు. కొంతకాలం వరకు బాగానే సాగింది. సిబ్బందికి వాకీ టాకీలు అందజేశారు. సెల్ ఫోన్లు తీసుకెళ్లకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఆ తర్వాత సిబ్బంది ఫోన్లు తీసుకెళ్లొచ్చని నిబంధనలు సడలించారు. పూజారులు, వేద పండితులు కూడా సెల్ ఫోన్లు తీసుకెళ్లవచ్చు. మరికొన్ని రోజులకు దళారులకు కూడా ప్రత్యేక అనుమతి ఇచ్చేశారు. దళారులతో పాటు వెళ్లే భక్తులు కూడా ఆలయంలోకి సెల్ఫోన్లతో ప్రవేశించవచ్చు. కానీ విలేఖరులు మాత్రం ఫోన్లు తీసుకెళ్లకూడదు. ఆలయంలో జరిగే అవకతవకలు బయట ప్రపంచానికి తెలియకూడదు. భక్తులు ఎన్ని అవస్తలు పడినా ఎవరికంటా పడకూడదు. సమస్యల గురించి పత్రికల్లో, టీవీల్లో రాకూడదు. సిబ్బంది, పూజారులు, వేద పండితులు ఆలయంలో ఫోన్లను యధేచ్ఛగా వాడుకోవచ్చు. సమాచారమే కాకుండా అన్ని రకాల యాప్ లను వినియోగిస్తున్నారు. దీనిపై ఎటువంటి పర్యవేక్షణ లేదు. ప్రధాన ద్వారమైన కంచు గడపల వద్ద ఎస్పీఎఫ్ సిబ్బంది. హెరీం గార్డులు, ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బంది ఉంటారు. వీరిని దాటుకొని చీమ కూడా ఆలయంలోకి వెళ్లదు. అయితే ఆలయ సిబ్బందితో పాటు దళారులు, దళారులు తీసుకెళ్లే భక్తులు, ప్రముఖుల పేరుతో వచ్చే కొందరు ఫోన్లు తీసుకెళుతున్నా భద్రత సిబ్బంది సగౌరవంగా పంపిస్తారు. సమాజానికి సమాచారం అందించే విలేఖరులు మాత్రం నిబందనలు గురించి చెపుతూ పక్షపాతం వహిస్తున్నారు.

## మాన్యువల్ స్కావెంజింగ్.. మరో ప్రాణం బలి



**సూళ్లూరుపేట, పెన్ పవర్, ప్రతినిధి, ఏప్రిల్ 3 :** దేశవ్యాప్తంగా మాన్యువల్ స్కావెంజింగ్ నిషేధానికి చట్టాలు ఉన్నా, అమలులో లోపాలు మరో ప్రాణాన్ని బలి తీసుకున్నాయి. తిరుపతి జిల్లా సూళ్లూరుపేట కెఆర్‌పి షార్ కాలనీలో సెప్టిక్ ట్యాంక్ శుభ్రం చేస్తూ ఎద్దల నాగరాజు (41) దుర్మరణం చెందాడు. దావాదిగుంట గ్రామానికి చెందిన నాగరాజు 15 ఏళ్లుగా కాంట్రాక్టు ఉద్యోగిగా షార్ పరిధిలో పనిచేస్తున్నాడు. ట్యాంక్ శుభ్రం చేయడం కోసం లోపలికి దిగిన సమయంలో ఊపిరాడక ప్రాణాలు కోల్పోయాడు. కెఆర్‌పి హాస్పిటల్ వద్ద మృతుని కుటుంబసభ్యులు అధికారులను కలిసి, బాధ్యులపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని అభ్యర్థిస్తున్నారు. మాన్యువల్ స్కావెంజింగ్‌పై కఠినమైన అమలు లేకపోతే నిరుపేద కార్మికుల ప్రాణాలు ముప్పులోనే ఉంటాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

## అంబేద్కర్ విగ్రహ ప్రాంగణాన్ని సుందరీకరణ చేయాలి




**నాయుడుపేట, పెన్ పవర్ ప్రతినిధి, ఏప్రిల్ 3 :** ఏప్రిల్ 14 అంబేద్కర్ జయంతి సందర్భంగా నాయుడుపేట పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహ ప్రాంగణానికి మరమ్మత్తులు చేయించి,సుందరీ కరణ చేయాలని కోరుతూ పలువురు అంబేద్కర్ వారసులు గురువారం నాయుడుపేట మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులల్లాకు వినతి పత్రం అందజేశారు. అందుకు సానుకూలంగా స్పందించిన మున్సిపల్ కమిషనర్ అంబేద్కర్ విగ్రహ ప్రాంగణం సుందరీకరణ పనులు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో రైల్వే రిటైర్డ్ సీ.టి.ఐ డి వి కృష్ణ, బహుజన టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు పేర్నాటి రామకృష్ణ ,న్యాయవాది రౌతు నరసయ్య,రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ కోటేశ్వరరావు,తొప్పాని రవి,జ్ఞానం వెంకటకృష్ణ,బందిలి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

## సిఐటియు చలో విజయవాడ..




**ధర్మవరం పెన్ పవర్ రాయలసీమ కోఆర్డినేటర్ ఏప్రిల్ 3 :** చలో విజయవాడ కార్యక్రమం నకు మునిసిపల్ పారిశుద్ధ్య కార్మికులకు అనుమతి ఇవ్వాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు మండల కన్వీనర్ జే వి రమణ, కో కన్వీనర్ టి.అయుబ్ ఖాన్, కార్మిక సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఏం. బాబు, ముకుంద, లక్ష్మి ఓబులేసు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు ఆప్కాస్ పద్ధతిని రద్దు చేసి కాంట్రాక్టు విధానం అమలు చేయాలనే ఆలోచనలను విరమించుకోవాలని, అలాకాని పక్షంలో కార్మికులకు రెగ్యులర్ చేయాలన్నారు. ఇప్పటికే కార్మికులకు కనీస వేతనాలు అమలు కాక అనేక విధాలుగా ఇబ్బందులకు గురి అవుతున్నారని, కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు కావడం లేదని, చనిపోయిన కార్మిక కుటుంబాలకు ఉద్యోగ అవకాశాలు కల్పించక పోవడంతో వారు అనేక ఇబ్బందులకు గురవుతుంటే, ఇప్పుడేమో పుండు మీదకారం చల్లినట్లు రాష్ట్ర ప్రభుత్వం ఆప్కాస్ పద్ధతిని రద్దుచేసి కాంట్రాక్ట్ విధానాన్ని అమలు చేస్తామని చెప్పడం కార్మికులకు మరింత నష్టం కలిగించే విధంగా ఉన్నదని, రాష్ట్ర ప్రభుత్వం.ఇటువంటి దుర్మార్గపు కాంట్రాక్టు విధానాల్ని.వెంటనే విరమించుకోవాలని రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కార్మికులు రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ మాత్యులకు వినతి పత్రం ఇవ్వడంకోసం. విజయవాడ వెళ్లడానికి అనుమతి ఇవ్వాల్సిందిగా మున్సిపల్ కమిషనర్ శ్రీ ప్రమోద్ కుమార్ గారికి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో చెన్నకేశవులు, ప్రసాద్ ,ఓబులప్ప, తదితరులు పాల్గొన్నారు.

## వివాహ రిసెప్షన్‌లో ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి



పుల్లంపేట పెన్ పవర్ రాయలసీమ కోఆర్డినేటర్ ఏప్రిల్ 3 : పుల్లంపేట మండలంలి జగువారిపల్లి గ్రామనికి చెందిన ఎఇ శ్రీనివాసులు వివాహ రిసెప్షన్ వేడుకలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. వైఎస్ఆర్సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు మరియు రాజంపేట శాసనసభ్యులు ఆకేపాటీ అమర్ నాథ్ రెడ్డి మరియు రాజంపేట జడ్పీటీసీ దాసరి పెంచలయ్య, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ దండు గోపి, సుబ్బరాజు, అంతయగారిపల్లి కుమార్ పలువూరు పాల్గొన్నారు.

## గోడ పత్రిక ఆవిష్కరణ

**7వ తేదీన ఎస్పీడీసీఎల్ ఆఫీస్ వద్ద ఆందోళన**

**11 రోజుల నుంచి నిరాహార దీక్ష చేస్తున్న పట్టించుకోని యాజమాన్యం**

**తిరుపతి/పెన్ పవర్/ ఏప్రిల్ 03 :** విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై గత 11 రోజులుగా తిరుపతి ఎస్పీడీసీఎల్ కార్యాలయం వద్ద కార్మికులు ఎర్రటి ఎండలో రిలే నిరాహార దీక్ష లు చేస్తున్నా యాజమాన్యం పట్టీ పట్టనట్టు వ్యవహరిస్తుంది. తప్పితే న్యాయమైన సమస్యలను పరిష్కరించే పరిస్థితి కనబడడం లేదని సిఐటియు తిరుపతి జిల్లా కార్యదర్శి జయచంద్ర అన్నారు. కార్మికులు చేస్తున్నటువంటి రిలే నిరాహార దీక్షల కు మద్దతు తెలుపుతూ ఈనెల 7 వ తారీఖు (సోమవారం) జరగబోయే మహాధర్నా పోస్టర్లు ఆవిష్కరణ చేశారు. దశాబ్దాలు కాలంగా ఎస్పీడీసీఎల్ ఆఫీసు నమ్ముకుని పనిచేస్తున్న వారిని రెగ్యులరైజేషన్ చేయకుండా కనీసం తెలంగాణ తరహాలో జీతాలను అమలు చేయడం లేదు. సబ్ స్టేషన్లలో పనిచేస్తూ ప్రాణాలు సైతం పోతున్న యాజమాన్యం పట్టించుకునే పరిస్థితి లేదు. సమస్యలు పరిష్కరించకపోతే ఈ రాష్ట్రంలో ఉన్నటువంటి కాంట్రాక్ట్ కార్మిక వర్గాన్ని ఏకం చేసి రోడ్లమీదకి రావాల్సి వస్తుందని హెచ్చరించారు. ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి డా.సాయి లక్ష్మి, సిఐటియు శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ లక్ష్మీ, సుజాత పాల్గొని మద్దతు ప్రకటించడం జరిగింది. విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై ఏడో తారీకు జరుగుతున్నటువంటి మహా ధర్నాకు ప్రజాసంఘాల నుంచి తాము కూడా మద్దతు ప్రకటించి ఆందోళనకు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునివ్వడం జరిగింది. ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శివ ప్రసాద్ రెడ్డి, ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కుమార్ మాట్లాడుతుప్రమోషన్లు వచ్చినా జీతాలు పెంచే పరిస్థితి లేకుండా కేవలం ఎస్పీడీసీఎల్ పరిధిలో ఉన్నటువంటి సమస్యను పరిష్కరించే విధంగా ఈ యాజమాన్యం లేదు. జీతాలు పెంచకుండా తీవ్రమైనటువంటి ఇబ్బందులకు గురవుతున్నారు. ఎన్నికల ముందు ప్రభుత్వం కాంటాక్ట్ వర్కర్స్ అందరిని పర్మినెంట్ చేస్తామని చెప్పడం జరిగింది అధికారంలోకి వచ్చిన తర్వాత మాట తప్పినారు. జీవో నెంబర్ రెండును సవరించి అందరూ కాంటాక్ట్ వర్కర్స్‌కు మినిమం టైం స్కేల్ వర్తింపజేయాలని డిమాండ్ చేయడం జరిగింది. ఈ సమావేశంలో శ్రీకాళహస్తి కార్యదర్శి రవి, మురళి, హరి, హుస్సేన్ పీర్, ఆత్మకూరు కార్యదర్శి విజయరామిరెడ్డి, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, అలీ, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల జట్టు ఎంపిక

**కలెక్టరేట్ ఒంగోలు, పెన్ పవర్ ఏప్రిల్ 03 :** ఈ నెల 11వ తేదీ నుండి 13వ తేదీ వరకు ఎన్టీఆర్ జిల్లా గుడివాడలో జరగబోయే రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు ప్రకాశంజిల్లా ఒంగోలులోని భారత జాతీయ వ్యాయామ కళాశాలలో డిస్టిక్ సెలక్షన్స్ జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీఎస్డీఓ రాజరాజేశ్వరి, ప్రకాశం జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు కుర్రా భాస్కరరావు, ప్రకాశంజిల్లా అసోసియేషన్ కార్యదర్శి గుంటి భక్త ధృవుడు, ప్రకాశంజిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు రమేష్, ప్రకాశంజిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఉపాధ్యధ్యక్షులు గుంటి పవన్ కుమార్, జాయింట్ సెక్రెటరీ మల్లికార్జునరావు, రాఘవరావు, క్రైమ్ బ్రాంచ్ సాయి, అనిల్, పీఈటి అశోక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఉప రవాణాశాఖ కమీషనర్ సుశీల స్పాన్సర్ చేసిన ఫ్రీ కాస్ట్యూమ్స్ ని డీఎస్డీవో ఆవిష్కరించడం జరిగింది. జిల్లావ్యాప్తంగా ఈ కార్యక్రమానికి సుమారు నూట యాభై మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను ముఖ్య అతిధులు అభినందించారు. రాష్ట్రస్థాయిలో కూడా ప్రకాశంజిల్లాకు ఎన్నో పతకాలు తీసుకుని రావాలని క్రీడాకారులను అభినందించారని ప్రకాశం జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి భక్తధృవుడు తెలిపారు.

## సిఐటియు ఆధ్వర్యంలో ఆశ వర్కర్ల సమీక్ష సమావేశం



**శ్రీకాళహస్తి, పెన్ పవర్, ప్రతినిధి, ఏప్రిల్ 3 :** కేవీ బిపుర మండల కేంద్రంలో గురువారం ఆశ వర్కర్లు సమావేశాన్ని సి.ఐ.టి.యు జిల్లా కమిటీ సభ్యులు నాగలాపురం నాగరాజు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశా వర్కర్లకు కొత్త కొత్త యాప్లు పెట్టి పని భారాన్ని ఎక్కువ చేస్తున్నారని దీనికి తోడు గర్భవతులను ప్రభుత్వ హాస్పిటలకు తీసుకొని పోవడానికి రాత్రి పగలు తేడా లేకుండా శ్రమిస్తున్న వారికి బస్సు చార్జీలు కూడా ఇవ్వడం లేదని ఇకనైనా ప్రభుత్వం ఆశా వర్కర్ల సేవలను గుర్తించి వారు రానుపోను చార్జీలు ప్రభుత్వం ఇవ్వాలని ఆశా వర్కర్లకు రికార్డు వర్క్ ను తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి పాల్గొన్న వారు అంగన్వాడి వర్కర్లు హెల్పర్ యూ నియన్ కార్యదర్శి రాజేశ్వరి ఆశ వర్కర్లు యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కవిత కార్యదర్శి లక్ష్మి కె. వి .బి. పురం మండలం అధ్యక్షురాలు సరళ కోవునూరు కార్యదర్శి సుజాత మునెమ్మ పద్మ దీప శారద ఎల్లమ్మ కృష్ణవేణితదితరులు పాల్గొన్నారు.

## నేడు ప్రజాదర్బార్, మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

**చంద్రశేఖరపురం, పెన్ పవర్ ఏప్రిల్ 3 :** చంద్రశేఖర పురం పట్టణంలోని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం మరియు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రజా దర్బార్ కార్యక్రమంనకు ముఖ్యఅతిథిగా కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పాల్గొంటున్నారని మండల టిడిపి అధ్యక్షులు డాక్టర్ బొమ్మన బోయిన వెంగయ్య తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికై ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించ నున్నట్లు తెలిపారు తెల ఈ సందర్భంగా మండలంలోని అన్ని గ్రామపంచాయతీలలో ప్రజలందరూ నేటికీ సమస్యలు పరిష్కారం కాక ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆధార్ కార్డు జిరాక్స్ తో పాటు అర్జీ రూపంలో ప్రజాదర్బార్ లో ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చినట్లయితే, సమస్యను పరిష్కరించుటకు ప్రజా దర్బార్ లో మండల శాఖ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలతో వీలైనంత మటుకు అక్కడికక్కడే సమస్యను పరిష్కారానికి చొరవ చూపుతారని తెలిపారు. సాంకేతిక లోపం వల్ల, ఇతర కారణాలవల్ల సమస్యలు ఉన్నట్లయితే క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి సమస్యను పరిష్కరించుటకు, న్యాయబద్ధంగా ఉన్న సమస్యలు పరిష్కరించుటకు వాటికి సంబంధించిన అధికారులకు పలు సూచనలు ఇచ్చి పరిష్కారం చేయుటకు ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

# ఎన్నికల ప్రక్రియకు సంబంధించి గుర్తింపు పొందిన జాతీయ పార్టీలతో సమావేశం

### జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి




**అనంతపురం, పెన్ పవర్, ఏప్రిల్ 03 :** ఒకే వ్యక్తి 5 కంటే ఎక్కువ క్లెయిమ్స్ తప్పుగా నమోదు చేస్తే వాటిని క్రాస్ వెరిఫికేషన్ 100% ఫీల్డ్ విచారణ AERO, BLO మరియు Dy తహాశీల్దార్ స్థాయి అధికారితో కూడిన EROచే నియమించబడిన 3 సభ్యుల బృందంచే విచారణ నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ పేర్కొన్నారు. గురువారం ఉదయం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో గుర్తింపు పొందిన జాతీయ మరియు రాష్ట్ర రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించిన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి నెలా రాజకీయ పార్టీలతో ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన సమస్యల పై చర్చించాలని మరియు ప్రస్తుతమున్న చట్టం ప్రకారం వారి సామర్థ్యం మేరకు తగిన చర్యలు తీసుకోవాలని ECI ఆదేశించిందని, అలాగే ERO/DEO పరిధిలో పరిష్కరించలేని సమస్యలు సీఈఓకు నివేదించడం జరుగుతుందని, ఎన్నికల ప్రక్రియలో అత్యంత ముఖ్యమైన వాటాదారులుగా ఉన్న రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రక్రియను పటిష్టం చేసేందుకు తమ సూచనలు ఇవ్వాలని అన్నారు. అన్ని రాజకీయ పార్టీలు BLAలను నియమించాలని మరియు వారి సంప్రదింపు జరుపుటకు మొబైల్ నెంబర్ తో పాటు BLAల యొక్క తాజా జాబితాను ఇవ్వాలని తెలిపారు. తద్వారా DEO & ERO లకు రాజకీయ పార్టీ జిల్లా అధ్యక్షుడు సంతకం చేసి ఇవ్వాలని, తద్వారా ఓటర్ల జాబితాలను పారదర్శకంగా తయారు చేయుటకు వీలవుతుందని తెలిపారు. ఫారమ్-7 దరఖాస్తులను నిర్ణీత విధానాన్ని అనుసరించి మూసి వేయాలని ప్రధాన ఎన్నికల అధికారి, విజయవాడ నుండి ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. గతంలో 20.03.2025న అనంతపురం జిల్లాలోని అన్ని పార్టీల రాజకీయ ప్రతినిధులందరితో రాజకీయ పార్టీ సమావేశం నిర్వహించడం 20.03.2025న జరిగిన సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ సందేహాలను తెలియజేయడం జరిగిందని తెలిపారు. ఇందులో BSP పార్టీ ప్రతినిధి M. అంజయ్య రాప్తాడు నియోజకవర్గంలో రాప్తాడు మరియు అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో ఒక వ్యక్తికి 2 ఓట్లు ఉన్నాయని, అలాంటి ఓట్లను తొలగించాలని అభ్యర్థించారు. ఈ విషయంలో తదుపరి చర్యలు తీసుకోవడానికి ప్రాతినిధ్యంతో పాటు అవసరమైన పత్రాలను సమర్పించాలని కలెక్టర్& జిల్లా ఎన్నికల అధికారి తెలియజేశారు. ఇంకా చీఫ్ ఎలక్టోరల్ అధికారి విజయవాడ, అదే ఫారమ్ 7 దరఖాస్తుల జాబితాను AERO లాగిన్‌కి పంపారు మరియు అదే క్రింది విధి విధానాలను మూసివేయమని తెలిపారని తెలియజేశారు. రాప్తాడు నియోజకవర్గంలో రాజకీయ పార్టీ సమావేశం నిర్వహిస్తున్నప్పుడు అనంతపురం రూరల్ నుండి అధికారులెవరూ సమావేశానికి హాజరు కావడం లేదని సీపీఐ (ఎం) పార్టీ ప్రతినిధి శ్రీ ఎం.బల రామయ్య పేర్కొన్నారు. జవాబు గా రాప్తాడు నియోజకవర్గంలో MRO రాప్తాడులో నిర్వహించిన రాజకీయ పార్టీ సమావేశానికి AERO తహశీల్దార్ అనంతపురము రూరల్ హాజరయ్యారని కలెక్టర్ & జిల్లా ఎన్నికల అధికారి తెలియజేసారు.

అనంతపురం జిల్లాలో ఆధార్ సీడింగ్ ఎప్పుడు ప్రారంభిస్తారని YSRCP పార్టీ ప్రతినిధి సి.సోమశేఖర్ రెడ్డి తెలిపారు. సమాధానం గా ఎన్నికల సంఘం నుండి ఆదేశాలు ఇంకా అందలేదని, ఆ తర్వాత అనంతపురం జిల్లాలో ఆధార్ సీడింగ్ ప్రక్రియను ప్రారంభిస్తామని కలెక్టర్ & జిల్లా ఎన్నికల అధికారి తెలియజేసారు. ఒకే వ్యక్తి 5 కంటే ఎక్కువ క్లైములు వ్యక్తం చేసిన అన్ని కేసుల క్రాస్ వెరిఫికేషన్ కోసం ఏకరీతి విధానాన్ని కలిగి ఉండటానికి మరియు బల్క్ కేసులను ఫైల్ చేయడానికి ఆన్‌లైన్ నిబంధనను దుర్వినియోగం చేసే విషయమై 5 కంటే పైన ఒకే వ్యక్తి దాఖలు చేసిన అన్ని అభ్యంతరాలు/ఫారం-7 సంబంధిత ERO ద్వారా వ్యక్తిగతంగా క్రాస్ వెరిఫై చేయడం జరుగుతుందన్నారు. అటువంటి కేసులన్నింటిలో 100% ఫీల్డ్ విచారణ AERO, BLO మరియు Dy తహాశీల్దార్ స్థాయి అధికారితో కూడిన EROచే నియమించబడిన 3 సభ్యుల బృందంచే విచారణ నిర్వహించడం జరుగుతుందన్నారు.

అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల BLAలకు ఫీల్డ్ వెరిఫికేషన్ షెడ్యూల్ గురించి తెలియజేయబడు తుందని మరియు 3 సభ్యుల బృందంతో పాటు వెళ్లేందుకు అనుమతించబడతారు. ఫీల్డ్ వెరిఫికేషన్ సమయంలో హాజరు కావాలని అభ్యంతరం దాఖలు చేసిన వ్యక్తికి నోటీసు జారీ చేయడం జరుగుతుందని, ఫీల్డ్ వెరిఫికేషన్ నివేదికను 3 సభ్యుల బృందం సమర్పించిన తర్వాత, ERO వ్యక్తిగత విచారణను నిర్వహిస్తారని దీనిలో అభ్యంతరాన్ని దాఖలు చేసిన వ్యక్తి కూడా హాజరుకావలసి ఉంటుందని, అభ్యంతరం వాస్తవమని తేలితే, నిర్ణీత ప్రక్రియను అనుసరించి తొలగింపు చేయబడుతుందని ఒకే వ్యక్తి బహుళ/బల్క్ ఫారమ్‌లను దాఖలు చేసినట్లు ERO అనుమానించినట్లయితే, ఫారం-6తో సహా ఇతర ఫారమ్‌ల విషయంలో కూడా అదే విధానాన్ని అనుసరించాలి. అభ్యంతరం తప్పు/తప్పు అని తేలితే, అతను ఒక సంవత్సరం వరకు జైలు శిక్ష లేదా జరిమానా లేదా రెండింటితో శిక్షించబడతారని ECI సూచనల ప్రకారం dt 29.05.2023, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల BLAలు ఒకేసారి/ఒకేరోజులో BLOకి బల్క్‌లో 10 దరఖాస్తులను ఫైల్ చేయవచ్చు. క్లెయిమ్‌లు మరియు అభ్యంతరాలను దాఖలు చేసే మొత్తం వ్యవధిలో BLA 30 కంటే ఎక్కువ దరఖాస్తులు / ఫారమ్‌లను ఫైల్ చేసినట్లయితే, క్రాస్ వెరిఫికేషన్ తప్పనిసరిగా ERO/ AERO ద్వారానే చేయాలి. బూత్ లెవల్ ఏజెంట్ల (BLA) నియామకం సంబంధించి కమిషన్ పేర్కొన్న సూచనల ప్రకారం, ఓటర్ల జాబితా తయారీ మరియు సవరణ ప్రక్రియలో పారదర్శకతను పెంచడానికి మరియు విశ్వసనీయతను మెరుగుపరచడానికి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలచే బూత్ స్థాయి ఏజెంట్లను (BLA) నియమించుకునే సదుపాయాన్ని కల్పించింది. ప్రతి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ దాని ప్రెసిడెంట్ లేదా సెక్రటరీ లేదా ఏదైనా ఇతర ఆఫీస్ బేరర్ ద్వారా బూత్ లెవల్ ఏజెంట్లను (BLAలు) నియమించడానికి ఒక జిల్లా ప్రతినిధికి అధికారం ఇస్తుంది. సాధారణంగా, ఎలక్టోరల్ రోల్‌లోని ప్రతి భాగానికి ఒక BLAని నియమించవచ్చు. చనిపోయిన వ్యక్తులు మరియు బదిలీ చేయబడిన వ్యక్తుల నమోదులను గుర్తించడానికి BLA అతను నివసించే ప్రాంతం యొక్క డ్రాఫ్ట్ రోల్‌లోని ఎంట్రీలను పరిశీలిస్తారని భావిస్తున్నందున, BLA తప్పనిసరిగా అతను/ఆమె నియమించబడిన ఓటర్ల జాబితా యొక్క సంబంధిత భాగంలో నమోదిత ఓటర్గై ఉండాలి.ఎలక్టోరల్ రోల్‌లోని సంబంధిత భాగాల కోసం పోలింగ్ స్టేషన్‌లను ఒకే పోలింగ్ స్టేషన్ స్థానంలో ఏర్పాటు చేసినట్లయితే, ఓటర్ల జాబితాలో ఒకటి కంటే ఎక్కువ భాగాలకు ఒక BLAని నియమించవచ్చు. ప్రభుత్వం లేదా స్థానిక అధికారం లేదా PSU సేవలో ఉన్న ఏ వ్యక్తి బూత్ స్థాయి ఏజెంట్‌గా వ్యవహరించలేరు. ఏదైనా రాజకీయ పార్టీ కోరుకుంటే, BLAలను నియమించడానికి పార్టీ అధికారం కలిగిన అధికార ప్రతినిధి సంతకంతో వారి BLAలకు ఫోటోగ్రాఫ్ చేసిన గుర్తింపు కార్డులను కూడా జారీ చేయవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో డిఆర్ఓ ఏ.మలోల, ఎన్నికల విభాగపు తహసిల్దార్ యోగేశ్వరి, డిటి కనకరాజు, రాష్ట్ర రాజకీయ పార్టీల ప్రతినిధులు టిడిపి పార్టీ తరఫున కేనారాయణ స్వామి, శివశంకర్,కాంగ్రెస్ పార్టీ హిమాం వలి, వైఎస్ఆర్ సిపి పార్టీ జి.శ్రీనివాసులు,సిపిఎం పార్టీ ఎం బాల రంగయ్య, బిఎస్‌పి పార్టీ అంజయ్య, హమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ వెంకట రమణ, జాయింట్ సెక్రెటరీ మహమ్మద్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్యాల మేరకు రుణాలు మంజూరు చేయాలి

### - జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా





**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ ఏప్రిల్ 03 :** బిసి., ఈబీసీ కాపు యాక్షన్ ప్లాన్ కింద బ్యాంకులకు కేటాయించిన లక్ష్యాల మేరకు రుణాలు మంజూరు చేసి ఆయా వర్గాల ప్రజల అభ్యున్నతికి తమ వంతు ఆర్థిక తోడ్పాటు అందించాలని జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా, బ్యాంకర్లను కోరారు. గురువారం ఉదయం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, బిసి కార్పొరేషన్ అధికారులు, వివిధ బ్యాంకుల అధికారులతో సమావేశమై, బిసి కార్పొరేషన్ ద్వారా బిసి, రెడ్డి, క్షత్రియ, కమ్మ, ఈబిసి, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, కాపు వర్గాలకు స్వయం ఉపాధి పథకాల కింద మంజూరు చేసిన వివిధ యూనిట్స్ గ్రౌండింగ్ పురోగతి పై సమీక్షించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో బిసి, రెడ్డి, క్షత్రియ, కమ్మ, ఈబిసి, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, కాపు వర్గాలకు స్వయం ఉపాధి పథకాల కింద 1,864 యూనిట్స్ మంజూరుకు సంబంధించిన దరఖాస్తులను జిల్లా లోని వివిధ బ్యాంకులకు పంపడం జరిగిందన్నారు. నిర్దేశించిన లక్ష్యం మేరకు ఈ నెల 9వ తేదీ లోపు సుమారు వెయ్యి యూనిట్స్ గ్రౌండింగ్ చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, బ్యాంకర్ల ను ఆదేశించారు. ఈ నెల 11వ తేదీన జరిగే మహాత్మా జ్యోతి రావు పూలే జయంతి రోజున సంబంధిత లబ్దిదారులకు యూనిట్స్ మంజూరు ఉత్తర్వులు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, బిసి కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. బ్యాంకర్లు తమకు కేటాయించిన లక్ష్యాల మేరకు రుణాలు మంజూరు చేసి ఆయా పేద వర్గాల ప్రజల అభ్యున్నతికి తమ వంతు సహకారం అందించాలన్నారు. ప్రతిబ్యాంకుకు ఇచ్చిన లక్ష్యాల మేరకు పథకాలు మంజూరు చేసి, గ్రౌండింగ్ అయ్యేలా చూడాలని ఆదేశించారు. ఈ సమావేశంలో బిసి కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వర రావు, ఎల్.డి.ఎం రమేష్, బ్యాంకర్లు తదితరులు పాల్గొన్నారు.

# తొలకరి జల్లులను తలపించిన చిరుజల్లులు






**కొమరోలు పెన్ పవర్ ఏప్రిల్ 3 :** కొమరోలులో గురువారం మధ్యాహ్నం 3 గంటల నుంచి తొలకరి జల్లులను తలపిస్తూ చిరుజల్లు కురిసాయి. గత రెండు మాసాలుగా పగలు ఎండలు తీవ్రంగా కాస్తుండగా, వడగాడుపులు కూడా వీస్తున్నాయి. ఇక అర్ధరాత్రి వరకు కూడా వడగాడుపులు ఇస్తున్నందువల్ల పేద ప్రజలు ఉక్కపోతతో అల్లాడుతూ నిద్రకు దూరమవుతున్నారు కాగా, గురువారం మధ్యాహ్నం నుంచి వాతావరణంలో మార్పు కనిపించింది .ఆకాశం మేఘాలతో నిండి ,ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురుస్తుందా ?అన్నట్లుగా వాతావరణం మారిపోయింది. అయితే ఆ తర్వాత కొద్దిసేపటికి ఉరుములు మెరుపులతో ఆకాశం నిండిపోయి చిరుజల్లులు కురిసాయి. కేవలం సిమెంట్ రోడ్లు తడిచే విధంగా మాత్రమే జల్లులు కురిసాయి. రోడ్లకు ఇరువైపుల గల మార్జిన్లు కూడా తడవకపోవడంతో కురిసిన చిరుజల్లులతో ప్రజలు నిరాశ చెందారు. ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసి వాతావరణం చల్లబడి కొంత ఉపశమనం కలిగిస్తుందని ఆశించిన ప్రజలకు తీవ్ర నిరాశ ఎదురయ్యింది .అయితే ఆకాశం ఉరుములు మెరుపులతో నిండి పోవడంతో ప్రజలు పిడుగులు తలుచుకుంటూ భయాందోళన చెందారు . కాగా పెనుగాలులు వేయకపోవడంతో ప్రజలు కొంత ఊరట చెందారు . ఉరుముల మెరుపులకు భయపడి పొలాల్లో ఉన్న కూలీలు పరుగు పరుగున ఇళ్లకు చేరుకున్నారు. అకాల వర్షాల వల్ల అనర్థాలు తప్ప పెద్దగా ప్రయోజనం ఉండదని రైతులు చెబుతున్నారు.

# రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల జట్టు ఎంపిక



**కలెక్టరేట్ ఒంగోలు, పెన్ పవర్ ఏప్రిల్ 03 :** ఈ నెల 11వ తేదీ నుండి 13వ తేదీ వరకు ఎన్టీఆర్ జిల్లా గుడివాడలో జరగబోయే రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు ప్రకాశంజిల్లా ఒంగోలులోని భారత జాతీయ వ్యాయామ కళాశాలలో డిస్టిక్ సెలక్షన్స్ జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీఎస్డీఓ రాజరాజేశ్వరి, ప్రకాశంజిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు కుర్రా భాస్కరరావు, ప్రకాశంజిల్లా అసోసియేషన్ కార్యదర్శి గుంటి భక్త ధృవుడు, ప్రకాశంజిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు రమేష్, ప్రకాశంజిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఉపాధ్యధ్యక్షులు గుంటి పవన్ కుమార్, జాయింట్ సెక్రెటరీ మల్లికార్జునరావు, రాఘవరావు, క్రైమ్ బ్రాంచ్ సాయి, అనిల్, పీఈటి అశోక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఉప రవాణాశాఖ కమీషనర్ సుశీల స్పాన్సర్ చేసిన ఫ్రీ కాస్ట్యూమ్స్ ని డీఎస్డీవో ఆవిష్కరించడం జరిగింది. జిల్లావ్యాప్తంగా ఈ కార్యక్రమానికి సుమారు నూట యాభై మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను ముఖ్య అతిధులు అభినందించారు. రాష్ట్రస్థాయిలో కూడా జిల్లాకు ఎన్నో పతకాలు తీసుకుని రావాలని ఆకాంక్షించారు.

## లిక్కర్ స్కామ్‌లో ఎంపీ మిథున్‌రెడ్డికి బిగుస్తున్న ఉచ్చు...!!!



**కడప పెన్ పవర్ రాయల సీమ కోఆర్డినేటర్ ఏప్రిల్ 3 :** ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టు తప్పదంటూ ప్రచారం. అరెస్టు భయంతో ముందస్తు బెయిల్ కోసం హైకోర్టుకు వెళ్లిన మిథున్‌రెడ్డి. ముందస్తు బెయిల్ పిటిషన్ డిస్మిస్ చేసిన ఏపీ హైకోర్టు. వైసీపీ హయాంలో ఏరులైన పారిన మద్యం. నచ్చిన కంపెనీలకు మద్యం ఆర్డర్లు ఇవ్వడంలో మిథున్‌రెడ్డి కీలక పాత్ర పోషించినట్లు సమాచారం. లిక్కర్ స్కామ్‌లో పేరు తెరమీదకు రావడంతోమిథున్‌రెడ్డిలో అరెస్టు భయం. ముందస్తు బెయిల్ పిటిషన్ డిస్మిస్ చేయడంతో ఏం జరగబోతోందనే ఉత్కంఠ.

## నూతన వధూవరులు బాలయ్య, ప్రమీల కళ్యాణం



**కడప పెన్ పవర్ రాయలసీమ కోఆర్డినేటర్ ఏప్రిల్ 3 :** కడప నగరం స్థానిక మూడో డివిజన్ శ్రీరామ్ నగర్ వెలసిన శ్రీశ్రీశ్రీ సీత కోదండ రామస్వామి దేవస్థానం నందు బాలయ్య, ప్రమీల నూతన వధూవరుల వివాహ వేడుకలో ఆశీర్వదించిన దేరంగుల శ్రీనివాసులు సింహాద్రి, రాయల సీమ కోఆర్డినేటర్, హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఏపీ అండ్ తెలంగాణ రీజినల్ డైరెక్టర్ సమ్మిరెడ్డి కృష్ణారెడ్డి, నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ వివాహ కార్యక్రమంలో శ్రీరామ్నగర్ ప్రజలు, మహిళలు బంధువులు, స్నేహితులు సన్నితులు తదితరులు పాల్గొన్నారు.

## ఏల్చూరు జడ్పీ స్కూల్లో స్కౌట్ యూనిట్ ప్రారంభం




**రిపోర్టర్ సంతమాగులూరు, పెన్ పవర్ ఏప్రిల్ 03 :** దేశభక్తిని పునికి పుచ్చుకుని ప్రతి విద్యార్థి నిజాయితీ, క్రమశిక్షణతో ఆపదలో ఉన్న వారికి సాయం చేయడానికి ముందుకు రావాలని ప్రధానోపాధ్యాయుడు దారా బాలయ్య పిలుపునిచ్చారు. పీఎం శ్రీ (ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) యోజన పథకంలో భాగంగా బుధవారం బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలం ఏల్చూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో భారత స్కౌట్ అండ్ గైడ్స్ ట్రూప్ యూనిట్ ను హెచ్ఎం ప్రారంభించారు. ఈసందర్భంగా స్కౌట్ వ్యవస్థాపకుడు బెడెన్ పావెల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం తొలి బ్యాచ్ లోని 26 మంది విద్యార్థులకు స్కౌట్ యూనిఫామ్ దుస్తులు అందజేసి, స్కౌట్ విధి విధానాలపై అవగాహన కల్పించారు. స్కూలు టీచర్ల బృందం విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్కౌట్ మాస్టర్, పీడీ డాక్టర్ ఎన్.వీరేంద్ర, టీచర్లు కోటేశ్వరరావు, శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, గోపీనాథ్, మూర్తయ్య, కరిమున్నీసా, వీరకుమారి, పద్మ, ఎస్ఎంసీ ఛైర్మన్ వల్లెం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# జగన్ లో ఎంత మార్పో...



**విజయవాడ, ఏప్రిల్ 3, పెన్ పవర్:** అధికారంలో ఉన్నప్పుడు జగన్ కార్యకర్తల్ని, స్థానిక నేతల్ని పెద్దగా పట్టించుకోలేదనే ఆరోపణ ఉంది. దానికి ఆయన ప్రవర్తనే ప్రత్యక్ష సాక్ష్యం. లోకల్ లీడర్స్ తో పెద్దగా కలిసేవారు కాదు జగన్, ఆ మాటకొస్తే మంత్రులకు కూడా అపాయింట్ మెంట్లు దక్కేవి కావు, ఇక ఎమ్మెల్యేల సంగతి సరేసరి. జగన్ అపాయింట్ మెంట్ దొరకాలంటే ఎమ్మెల్యేలు రోజుల తరబడి తాడేపల్లి ప్యాలెస్ ముందు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఉండేది. ఇప్పుడు జగన్ అధికారం కోల్పోయాక పరిస్థితిలో మెల్ల మెల్లగా మార్పులొస్తున్నాయి. జగన్ కోటరీ ఒక్కొక్కరే దూరం జరిగారు. అధికారంలో ఉన్నప్పుడు గొంతు చించుకున్నవారు కూడా సైలెంట్ అయ్యారు. చివరకు మిగిలింది కార్యకర్తలు, స్థానిక నాయకులే. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో పార్టీకి లాయల్ గా ఉన్నవారు వైసీపీ పరువు కాపాడారు. అందుకే వారికి రేపు తాడేపల్లిలో ప్రత్యేకంగా అపాయింట్ మెంట్ ఇచ్చారు జగన్.రాష్ట్రంలో ఇటీవల జరిగిన ఎంపీపీ, జడ్పీ ఉప ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాభవాన్ని తప్పించుకుంది. గతంలో ఆయా సీట్లన్నీ వైసీపీకి చెందినవే. అయితే వివిధ కారణాలతో ఖాళీ అయిన స్థానాలకు ఉప ఎన్నికలు జరగగా, వైసీపీకి కాస్త అనుకూలంగా ఫలితాలొచ్చాయి. దీంతో జగన్ కి తత్వం బోధపడింది. తాను ఇన్నాళ్లూ దూరం పెట్టిన కార్యకర్తలు, స్థానిక నేతలే తనను వదిలిపెట్టలేదని అర్థమైంది. అధికారంలో ఉన్నప్పుడు తన చుట్టూ కోటరీగా తిరిగిన వాళ్లు, రాజ్యసభ స్థానాలు, ఎమ్మెల్సీలు తీసుకున్నవారు అడ్రస్ లేకుండా పోయారనే విషయం స్పష్టమైంది. దీంతో జగన్ లో మార్పు మొదలైంది. కార్యకర్తలకు హ్యాట్సాఫ్ అంటూ ఆమధ్య ట్వీట్ వేసిన ఆయన, తాజాగా స్థానిక నాయకులతో ప్రత్యేకంగా మీటింగ్ పెట్టారు. పార్టీ విజయానికి సహకరించిన ఎంపీటీసీలు, జడ్పీటీసీలను స్వయంగా కలుస్తానని కబురు పంపించారు జగన్. వారందర్నీ తాడేపల్లికి పిలిపిస్తున్నారు.వైసీపీ కేంద్ర కార్యాలయంలో జరిగే సమావేశానికి అంబేద్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి, ఎన్టీఆర్, బాపట్ల జిల్లాలకు సంబంధించి 8 నియోజకవర్గాల్లోని వైసీపీ ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులు, పార్టీ మండల అధ్యక్షులు, కో ఆప్షన్ సభ్యులు హాజరవుతారు. వీరందరికీ జగన్ ప్రత్యేకంగా సమయం కేటాయిస్తారట. అందరితో మాట్లాడి, క్షేత్ర స్థాయిలో పరిస్థితులు అడిగి తెలుసుకుంటారట.

**ఈ మార్పు సరిపోదు జగనూ..**

జగన్ లో మార్పు మొదలవడం మంచిదే, కానీ ఈ మార్పు సరిపోదు. అప్పట్లో చంద్రబాబు, పవన్ కల్యాణ్ ని పొరుగు రాష్ట్రం నేతలంటూ ఎగతాళి చేసిన జగన్.. అధికారం పోయాక తాను బెంగళూరులో ఎందుకు తలదాచుకుంటున్నారో చెప్పాల్సి ఉంది. కానీ జగన్ ఇప్లిపుడు అసలైన పొలిటికల్ టూరిస్ట్ లా మారిపోయారని సోషల్ మీడియాలో కౌంటర్లు పడుతున్నాయి. ఎప్పుడో ఎక్కడో రాష్ట్రంలో ఎవరైనా చనిపోతే మాత్రం పరామర్శలకు వస్తున్నారనే ఆరోపణ కూడా ఉంది. కానీ ఈసారి లోకల్ లీడర్స్ కోసం బెంగళూరు నుంచి జగన్ వస్తున్నారు. ఇది మెచ్చుకోవాల్సిన విషయమే. కానీ ఈ మార్పు సరిపోదు. అధికారంలో ఉన్నప్పుడు ఆయన కళ్లకు గంతలు కట్టి ఆడించింది కోటరీయేనని ఆ పార్టీ నేతలు కొందరు బలంగా నమ్ముతున్నారు. ఆ గంతలు ఆయన విప్పుకోవాలి. ప్రజల మధ్యకు వచ్చినప్పుడే ఏదైనా ఫలితం ఉంటుంది. అది కూడా కూటమి చేసే తప్పుల్ని బట్టే ప్రజలు జగన్ దగ్గరకు చేరతారనే విషయాన్ని మరింతగా అర్థం చేసుకోవాలి. పాలనలో కూటమి సక్సెస్ అయితే నాలుగేళ్ల తర్వాత కూడా ప్రజలకు జగన్ అవసరం ఉండదు.

# విజయనగరంలో వైసీపీ ఖాళీ...?

**విజయనగరం, ఏప్రిల్ 3, పెన్ పవర్:** ఉమ్మడి విజయనగరం జిల్లాలో టీడీపీ మరింత పుంజుకుంటోందా? అంటే అవుననే తెలుస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికలలోపు వైసీపీ పూర్తిగా ఖాళీ కాబోతుందా? అంటే కూడా అవుననే సమాధానం వినిపిస్తోంది.కురుపాం నుంచి ఎస్ కోట నియోజకవర్గం వరకూ ఎక్కడ చూసినా రాజకీయ వలసలు షరా మాములుగా మారిపోయాయి. మరీ ముఖ్యంగా 2019లో వైసీపీ ప్రభుత్వం ఏర్పడ్డానికి కష్టించి పని చేసిన హార్డ్ కోర్ ఫ్యాన్ పార్టీ ఫ్యాన్స్ కూడా ఇప్పుడు సైకిల్ బెల్లు కొట్టడానికి రెడీ అంటే రెడీ అంటున్నారట.ఒక్కో ఏరియాలో ఫలానా కావాలన్న షరతులు పెట్టకుండానే ఫ్యాన్ వదిలి సైకిలెక్కుతున్నారట. దీనంతటికీ కారణమేంటని చూస్తే.. అందరి నుంచి దాదాపు ఒకటే మాట వినిపిస్తోందట. ఇన్నాళ్ల పాటు రెక్కలు ముక్కలు చేసుకుని పార్టీని అధికారంలోకి తెస్తే.. తమకు మిగిలింది ఏదీ లేదని వీరంతా తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నట్టు సమాచారం. ఆ మాటకొస్తే ఫ్యాను రెక్కలు ముక్కలయ్యాయి.. మీ కంటికి కనిపించడం లేదా అంటూ ఎదురు ప్రశ్నిస్తున్నారట. ఇన్నాళ్ల పాటు జగన్ని నమ్ముకున్నందుకు తాము నట్టేట మునిగామనీ అంటున్నారట. ఆ పార్టీలాగే తమ జీవితాలు కూడా అలాగే ఛిన్నాభిన్నమై పోయిందనీ వీరంతా గుర్రుగా ఉన్నారట. దీంతో టీడీపీ, జనసేనకు జై కొడుతున్నారట.మరీ ముఖ్యంగా పార్వతీపురం, బొబ్బిలి మున్సిపాల్టీల్లో అయితే అవిశ్వాసానికి సైతం సిద్ధమయ్యారంటే ఫ్యాను పార్టీ పరిస్థితి ఎంత దారుణంగా ఉందో ఊహించుకోవచ్చని అంటున్నారు. బొబ్బిలి మున్సిపాల్టీలో ఇప్పటికే ఒక తిరుగుబాటు మొదలైందట. అవిశ్వాస తీర్మానం పెట్టడమే ఆలస్యమట.స్వయంగా వైసీపీ జిల్లా అధ్యక్షుడు, జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఫోన్ చేసి బుజ్జగించినా కుదరదని తెగేసి చెబుతున్నారంటే పరిస్థితి ఏంటో అర్థం చేసుకోవచ్చని

అంటున్నారు. గతంలో ఒక పార్టీ నుంచి మరొక పార్టీలో చేరాలంటే ఆయా ప్రాంతాల్లో పట్టున్న నాయకులతో రాయబారం నడిపించాలి. అదే ఇప్పుడు ఇందుకు రివర్స్ లో ఉందట వ్యవహారం. ఎవరూ ఏమీ అడక్కుండానే.. మేమే వచ్చేస్తున్నాం.. వద్దనకండి ప్లీజ్ అంటూ సైకిల్ బెల్ వారంతట వారే మోగిస్తున్నారట. చోటా మోటా నాయక గణం తమంత తాముగా వెళ్లి.. కూటమి పార్టీల కండువాలు కప్పేసుకుంటున్నారట.ఇక నెల్లిమర్ల నియోజకవర్గంలో అయితే వైసీపీని ఎప్పుడు ఖాళీ చేద్దామా? అన్నట్టుందట ఇక్కడి జనసేన ఎమ్మెల్యే లోకం మాధవి జోరు. వారానికి కనీసం రెండు మూడు గ్రామాల వైసీపీ కార్యకర్తలను తమ గ్లాసు పార్టీలో చేర్పించందే నిద్రపోవడం లేదట ఎమ్మెల్యే మాధవి. భవిష్యత్తులో తమకు పదవులు వచ్చినా రాకపోయినా.. వైసీపీ అనేది ఉండకూడదు. ఎటు నుంచి ఎటు చూసినా జనసేన మాత్రమే కనిపించాలన్నంత కసితో పని చేస్తున్నారట ఈ మహిళా ఎమ్మెల్యే.అయితే జిల్లా కేంద్రంలో పరిస్థితి కాస్త భిన్నంగా ఉందంటున్నారు. కోరి వస్తామన్నా చేద్దాం- చూద్దాం అంటూ దాట వేస్తున్నారట ఎమ్మెల్యే అతిథి గజపతిరాజు. వైసీపీలో అవినీతి మరక అంటని వారిని మాత్రమే తీసుకుంటున్నారట. ఇప్పటికే వైసీపీకి చెందిన కార్పొరేటర్లు వస్తామనీ.. కార్పొరేషన్ను టీడీపీ పరం చేస్తామని బంపరాఫర్లు ప్రకటిస్తున్నా.. కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు వద్దంటే వద్దంటున్నారట. ప్రజాస్వామ్యంలో ప్రజలు ఎవరికి అధికారం ఇస్తే.. వారే పరిపాలించాలని హితబోధ చేస్తున్నారట. అందులోనూ ఎవరిని పడితే వారిని పార్టీలోకి తీసుకుంటే నష్టం తమకేనని.. వారిస్తున్నారట. దీంతో తండ్రి మాట జవదాటలేక మున్సిపల్ ఎన్నికలు వచ్చే వరకూ వేచి చూసే ధోరణి అవలంభిస్తున్నారటు ఎమ్మెల్యే.ఇక ఎస్ కోట, చీపురుపల్లి, సాలూరు, గజపతినగరం, కురుపాం నియోజకవర్గాలలో చేరికల పరంపర ఒక రేంజిలో కొనసాగుతోందట. రోజుకో నియోజకవర్గంలో భారీ స్థాయిలో చేరికలు కనిపిస్తున్నాయట. గ్రామాలకు గ్రామాలు సైకిల్ కి సై అంటున్నాయట. దీంతో వైసీపీ లీడర్లు బయటకు రావడానికే తటపటాయించాల్సి వస్తోందట. పార్టీ ఖాళీ అవుతుంటే ఇటు చూస్తూ ఊరుకోలేక, అటు అధినేతకు చెప్పుకోలేక అవస్థలు పడుతున్నారట. ఏది ఏమైనా.. స్థానిక సంస్థలు, మున్సిపల్ ఎన్నికలు వచ్చే నాటికి ఈ ప్రాంతాల్లో వైసీపీ దాదాపు ఖాళీ అయ్యే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయట.

# దేవాదాయశాఖలో ఇంటి దొంగలు

**విజయవాడ, ఏప్రిల్ 3, పెన్ పవర్:** విజయవాడలో దేవాదాయ శాఖ భూములతో బ్యాంకులకు కుచ్చుటోపీ పెట్టిన ఘటన వెలుగు చూసింది. నగరం నడిబొడ్డున ఉన్న దాదాపు ఆరెకరాల భూమి అన్యాక్రాంతమైనా? దేవాదాయ శాఖ అధికారులు చూసిచూడనట్టు వ్యవహరిస్తున్నారు. ఇవే భూములకు నకిలీ పత్రాలను సృష్టించి వందల కోట్లకు బ్యాంకుల్ని మోసం చేశారు. దేవాదాయ శాఖకు దానపత్రం రాసిన భూములు అన్యాక్రాంతం అవుతున్నా వాటిని రక్షించేందుకు చర్యలు చేపట్టకపోవడం వెనుక దేవాదాయ శాఖ బాధ్యతలు చూసిన మాజీ మంత్రి హస్తం ఉందనే ఆరోపణలు ఉన్నాయి.విజయవాడ పటమటలో ఉన్న గోవిందరాజులు ధర్మ ఈనాం ట్రస్ట్ భూములు ఉన్నాయి. భూముల్ని దానం ఇచ్చిన దాతల కుటుంబానికి చెందిన మూడో తరం వారసులు భూముల విలువ పెరగడంతో అవి కుటుంబ ఆస్తులంటూ కోర్టుల్లో పిటిషన్లు వేశారు. ఆ భూముల్ని అమ్ముకోడానికి అనుమతివ్వాలని న్యాయస్థానాలను ఆశ్రయించారు. ఈ క్రమంలో భూములను దానం ఇచ్చిన సమయంలోనే వాటిని ధర్మకార్యక్రమాలలో దేనికి వినియోగించాలో స్పష్టం చేస్తూ రాసిన దాన పత్రం వెలుగు చూసింది. నగరం మధ్యలో ఉన్న వందల కోట్ల ఖరీదు చేసే ఈ భూమిని కాజేయడానికి కొన్నేళ్లుగా ప్రయత్నాలు జరుగుతున్నాయి.ఈ క్రమంలో దేవాదాయ శాఖకు సారథ్యం వహించిన మంత్రి అండతో భూముల్ని అమ్మేసే స్కెచ్ వేశారు. అంతకు ముందే ఇవే భూములపై ఓ జాతీయ బ్యాంకులో రుణాన్ని కూడా తీసుకున్నారు. ఈ క్రమంలో 2023లో వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా గోవిందరాజులు ఈనాం ట్రస్ట్ భూముల వ్యవహారంపై 2023లో మచిలీపట్నం శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానం ఈవో బి.సుబ్బారావు ప్రభుత్వానికి ఇచ్చిన నివేదిక వెలుగు చూసింది.పబ్లిక్ ట్రస్ట్‌కు సంబంధించిన భూమిని ప్రైవేట్ ట్రస్టుగా భావిస్తూ ట్రస్టీ ఎప్పుడూ భూమికి యజమాని కాలేదని గతంలో సుప్రీం కోర్టు, హైకోర్టులు స్పష్టం చేశాయని, ఆ తీర్పులకు విరుద్ధంగా కింది కోర్టులు ఇచ్చిన డిక్రీలను అడ్డం పెట్టుకుని భూముల్ని అమ్మే ప్రయత్నాలు చేయడంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. ట్రస్టు నిర్వహిస్తోన్న ట్రస్టీ దేవాదాయ చట్టం సెక్షన్ 30/87 ప్రకారం ఆస్తులను కాపాడలేకపోవడంతో చర్యలు తీసుకోవడంతో పాటు వారిని ట్రస్ట్ కార్యక్రమాల నుంచి తొలగించి వేరేవారిని నియమించడంతో పాటు ట్రస్ట్ ఆస్తుల్ని స్వాధీనం చేసుకోవాలని సిఫార్సు చేశారు.విజయవాడ నగరంలో ఉన్న దేవాదాయ శాఖ భూములు అన్యాక్రాంతం కావడంపై హిందూ ధార్మిక సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ క్రమంలో ఇటీవల విజయవాడ కనకదుర్గ దేవస్థానం భూముల్ని 50 ఏళ్లకు లీజుకిచ్చే అంశం వెలుగు చూసింది. ఈ క్రమంలోనే విజయవాడలో వందల కోట్ల దేవాదాయ శాఖ ఆస్తులు పరాధీనమైన వైనం ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. దేవాదాయ భూములను కాపాడాలని పోరాడుతున్న వారు వీటిని వెలుగులోకి తెస్తున్నారు. దేవాదాయ శాఖ అధికారుల నిర్లక్ష్యం, అలసత్వంతో ఖరీదైన భూముల వ్యవహారంలో ఉదాసీనత బయటపడింది. సామాజిక, దైవిక కార్యక్రమాలకు చెందిన భూములను కొందరు వ్యక్తిగత ప్రయోజనాల కోసం వాడుకోవడంపై అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ క్రమంలోనే పటమటలో ఉన్న గోవిందరాజు ట్రస్టు ఈనాం భూముల్ని చూపి జాతీయ బ్యాంకులో రూ.100కోట్ల రుణం తీసుకోవడం గతంలోనే వెలుగులోకి వచ్చింది. ఏపీకి చెందిన జాతీయ బ్యాంకు మరో బ్యాంకులో విలీనమైన తర్వాత ఈ వ్యవహారం పూర్తిగా మరుగున పడిపోయింది. అసలు వడ్డీలతో కలిపి ఈ మోసం విలువ రూ.200కోట్ల వరకు ఉంటుందనే ఆరోపణలు ఉన్నాయి.గోవిందరాజు వంశానికి చెందిన వారు తమ పూర్వీకుల నుంచి సంక్రమించిన పటమటలోని సర్వే నెంబర్ 91/2లోని 5,92 ఎకరాల స్థలాన్ని గోవిందరాజు ధర్మ ఈనాం ట్రస్టుకు దానం చేశారు. రిజిస్టర్డ్ డీడ్ ప్రకారం భూమిని జాగ్రత్తగా కాపాడాలని, ఈ భూమి ద్వారా వచ్చే ఆదాయాన్ని నాలుగు బాగాలు చేసి ధార్మిక కార్యక్రమాలకు వాడాలని, ఏ భాగం ఎందుకు వాడాలో కూడా దాన పత్రంలో స్పష్టం చేశారు.గోవింద రాజులు ట్రస్టుకు సంబంధించిన భూముల్ని లీజుకు తీసుకున్న వారి వారసుడు పదేళ్ల క్రితమే ఈ భూముల్ని తనఖా పెట్టి రూ.100కోట్ల రుణాన్ని తీసుకుని వాటిని చెల్లించలేదు.వడ్డీలతో కలిపి రుణమొత్తం భారీగా పెరిగింది. ఈ క్రమంలో గోవింద రాజు ట్రస్టును శ్రీ గోవింద రాజు ట్రస్టు పేరుతో దేవాదాయ శాఖను ప్రతివాదిగా చేర్చకుండా కోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. దీనికి విజయవాడకు చెందిన ఓ పార్టీ ప్రజాప్రతినిధులు, దేవాదాయ శాఖ మంత్రి ఒకరు సహకరించినట్టు తెలుస్తోంది.అసలైన ట్రస్టీలు ఉన్న సమయంలోనే ఆ భూముల్లో కొంత భాగాన్ని విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్‌కు అప్పగించడంతో అక్కడ దశాబ్దాలుగా హైస్కూల్ నిర్వహిస్తున్నారు. స్కూల్ నిర్వహిస్తున్నభూమిని కార్పొరేషన్‌కు గతంలోనే రిజిస్ట్రేషన్ చేశారు. 5.90 ఎకరాల భూమి దేవాదాయ శాఖకు చెందినదేనని 2023లో నే విచారణాధికారి నివేదిక సమర్పించినా నాటి ప్రభుత్వం దానిని అమోదించకుండా తొక్కి పెట్టింది.భూమి దేవాదాయ శాఖ స్వాధీనం చేసుకుంటే అసలు దొంగలు బయటపడతారు. దీంతో నివేదిక వెలుగు చూడకుండా విజయవాడకు చెందిన కీలక ప్రజాప్రతినిధులు చక్రం తిప్పారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో పూర్తి స్థాయిలో విచారణ జరిపితే ప్రజాప్రతినిధులు, అధికారులకు చిక్కులు తప్పవని హిందూ ధార్మిక సంఘాలు చెబుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఈ వ్యవహారంపై దృష్టి సారిస్తే పెద్ద ఎత్తున అక్రమాలు వెలుగు చూస్తాయని చెబుతున్నారు.

## సోషల్ మీడియాలో ప్రచారానికి హద్దే లేదా

**రాజమండ్రి, ఏప్రిల్ 3, పెన్ పవర్:** నవ్విపోదురు గాక నాకేటి సిగ్గు అన్నట్టుంది ప్రస్తుత రాజకీయాలు. సోషల్ మీడియా జనరేషన్‌లో పాలిటిక్స్ మరింత దారుణంగా ఉంటున్నాయి. పాస్టర్ ప్రవీణ్ పగడాల డెత్ కేసులో ఎంత రచ్చ జరిగిందో అంతా చూస్తున్నారు. సీసీపుటేజ్‌లో చిన్న అనుమానం కూడా లేదు. ప్రవీణ్ ఒంటిపై దాడి జరిగిన ఆనవాళ్లు కూడా లేవు. కత్తి పోట్లు, దెబ్బలు, విష ప్రయోగం.. గట్రా ఎలాంటి డౌట్ లేదు. కానీ, చంపేశారు.. చంపేశారు.. అంటూ సోషల్ మీడియాలో విష ప్రచారం చేశారు. సొసైటీలో మత చిచ్చు రగిల్చే ప్రయత్నం చేశారు కొందరు.ఈ తరహా ప్రచారం వెనుక ఓ పార్టీ ప్రోద్బలం ఉందనే ఆరోపణ ఉంది. ఆ పార్టీ అనుకూల వర్గీయుల నుంచే ఎక్కువగా రెచ్చగొట్టే పోస్టులు, కామెంట్లు వచ్చాయని పోలీసులు గుర్తించారు. వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకూ సిద్ధమవుతున్నారు.చనిపోయింది పాస్టర్ కాబట్టి.. ఎలా చనిపోయారో తెలీటం లేదు కాబట్టి.. చంపేశారు అంటే సరిపోతుందా? సున్నితమైన అంశం కావడం తమకు కలిసి వస్తుందని అనుకుంటున్నారా? కూటమి ప్రభుత్వాన్ని అబాసుపాలు చేసేందుకు ఇంతలా రెచ్చగొట్టాలా? మతం రంగు పులిమేసి.. జనాల్లో విద్వేషాన్ని రగిలిచ్చి ఏం చేయాలనుకున్నారు? ఆ వేడిలో రాజకీయ పబ్బం గడుపుకునే వ్యూహం పన్నారా? మరీ, ఇంతటి ప్రమాదకరమైన క్రీడ ఆడటం కరెక్టేనా?హైదరాబాద్ నుంచి కొవ్వూరు వరకు.. దారి పొడవునా గంటల తరబడి సీసీకెమెరా ఫుటేజ్ దొరికింది కాబట్టి సరిపోయింది. లేదంటే పోలీసులు చెప్పిన విషయాల్ని అంత ఈజీగా ఎవరైనా నమ్మేవాళ్లా? పాస్టర్ ప్రవీణ్ పగడాల విజయవాడ చేరుకోవడం.. అక్కడ పార్కులో సేద తీరడం.. అప్పటికే ఆయన బుల్లెట్ బండి హెడ్‌లైట్ పగిలిపోయి ఉండటం.. చాలా నీరసించి ఉండటం.. ఆ తర్వాత దారి మధ్యలో లిక్కర్ కొనడం.. ఇలా మినిట్ టు మినిట్ కంప్లీట్ సీసీఫుటేజ్ బయటపెట్టారు ఏపీ పోలీసులు. అవన్నీ చూశాక కానీ.. ప్రవీణ్‌ది హత్య కాకపోవచ్చు.. యాక్సిడెంటో, అస్వస్థత వల్లో చనిపోయి ఉండొచ్చు అని ప్రజలు ఇప్పుడిప్పుడే ఓ అంచనాకు వస్తున్నారు. ఒకవేళ ఆ సీసీకెమెరా దృశ్యాలు లభించి ఉండకపోయి ఉంటే..? ప్రవీణ్‌ను చంపేశారని ప్రజలకు ఫిక్స్ చేసేవారే కదా? సోషల్ మీడియా రచ్చ ఇప్పట్లో ఆగి ఉండేదా? క్రిష్టియన్లకు మిగతా వర్గాలకు మధ్య చిచ్చు పెడితే.. రాష్ట్రం మతాల వారిగా విడిపోతే.. అది అందరికీ నష్టమే కానీ ఎవరికీ లాభం కాదు. చివరికి ఆ పార్టీకి కూడా. అందరికీ అన్ని వర్గాల మద్దతు కావాల్సిందేగా. ఇంత చిన్న లాజిక్ ఎలా మిస్ అయ్యారు?ఇప్పుడే కాదు గతంలోనూ ఇలాంటి డైవర్ట్ పాలిటిక్స్ చూశాం. వివేకానందరెడ్డిని గొడ్డలితో అతి దారుణంగా తల నరికి చంపారు. ఆయన డెడ్‌బాడీ రక్తపు మడుగులో పడి ఉంది. ఆ స్పాట్ చూస్తే చిన్నపిల్లాడైనా చెప్పేస్తాడు అది హత్య అని. కానీ, గుండెపోటు అని ప్రకటించి చావు తెలివితేటలు చూపించారు కొందరు. అలా కొన్నిగంటల సేపు మాత్రమే బుకాయించ గలిగారు. నిజం బయటకు రాకుండా సమాధి చేయలేక పోయారు. ఆ కేసుతో సంబంధం ఉన్న వాళ్లంతా ఇటీవల వరుసగా చనిపోతుండటం.. హత్యా రాజకీయాలు ఇంకా ఆపలేదనే అనుమానాన్ని బలపరుస్తోంది. వివేక కేసులో హత్యను గుండెపోటుగా చిత్రీకరిస్తే.. పాస్టర్ ప్రవీణ్ పగడాల లాంటి సెన్సిటివ్ కేసులో మర్డర్ ముసుగు వేసే ప్రయత్నం పక్కా ప్లాన్డ్‌గా జరిగిందనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఆ దిశగా కూడా పోలీసుల విచారణ కొనసాగుతోంది. అదే నిజమని తేలితే సీరియస్ యాక్షన్ ఉంటుందని హెచ్చరిస్తున్నారు.

## సినిమాల్లోకి దువ్వాడ...

**శ్రీకాకుళం, ఏప్రిల్ 4, పెన్ పవర్:** దువ్వాడ శ్రీనివాస్-మాధురి.. ఏ తెలుగు న్యూస్ ఛానెల్ చూసినా, యూట్యూబ్ ఛానెల్ చూసినా వీరిద్దరి సందడి అంతా ఇంతా కాదు. మాధురి ఎపిసోడ్ కి టాప్ రేటింగ్స్ రావడంతో అప్పట్నుంచి ఆమెను మీడియా నీడలా అనుసరిస్తోంది. మాధురిని ఆకాశానికెత్తేయడం, ఆమెను హీరోయిన్ లా ఉన్నారని అనడం, అందులోనూ నగ్మాతో పోల్చడం.. ఆమెతో క్యాట్ వాక్ చేయించడం, పాటలు పాడించడం, డ్యాన్స్ చేయించడం.. అబ్బో ఇలాంటి సీన్స్ ఇంటర్వ్యూల్లో చాలానే ఉన్నాయి. తాజాగా ఓ ఇంటర్వ్యూలో సినిమా ఎంట్రీ విషయంపై మరోసారి క్లారిటీ ఇచ్చారు మాధురి.మాధురికి చాలా క్వాలిఫికేషన్లు ఉన్నాయని పొలిటీషియన్, వుమన్ ఎంటర్ ప్రెన్యూర్, ఇన్ ఫ్లూయెన్సర్, ఫైర్ బ్రాండ్.. ఇలా చాలా ఉన్నాయని, సినిమా హీరోయిన్ కూడా అందులో యాడ్ అవుతోందని యాంకర్ ఆమెను పొగడ్తల్లో ముంచెత్తారు. మాధురి కూడా తనకు చిన్నప్పటినుంచి యాక్టింగ్ అంటే ఆసక్తి ఉందని చెప్పుకొచ్చారు. అంతే కాదు, గతంలో తనకు టైమ్ దొరకలేదని, ఛాన్స్ దొరకలేదని.. టైమ్ వచ్చినప్పుడు అది కూడా జరుగుతుందని చెప్పుకొచ్చారు మాధురి.మాధురి తనకు సినిమాల్లోకి వెళ్లాలనుంది అని అనగానే, పక్కనే ఉన్న దువ్వాడ శ్రీనివాస్ ఊరుకుంటారా..? ఆయన కూడా మాధురి టాలెంట్ ని బయటపెట్టారు. పాటలు పాడటం కంటే కంటే ఆమె డ్యాన్స్ బాగా చేస్తుందని చెప్పుకొచ్చారు. భరతనాట్యంలో ఆమెకు ప్రవేశం ఉందన్నారు. నెమలికి నేర్పిన నడకలివీ అనే పాటతోపాటు, చాలా పాటలకు ఆమె అద్భుతమైన పర్ఫామెన్స్ ఇస్తుందన్నారు. గతంలో దువ్వాడ కూడా మాధురిని అడిగి మరీ కొన్ని పాటలకు డ్యాన్స్ వేయించుకునేవారట.దువ్వాడ శ్రీనివాస్ తనకు సీనియర్ ఎన్టీఆర్ అంటే ఇష్టమని, ఆయనే తనకు రోల్ మోడల్ అని చెప్పుకొచ్చారు. ఇప్పటికీ ఆయన సినిమాల్ని తాను చూస్తుంటానని, హోమ్ థియేటర్లో ఆయన సినిమాలు చూస్తానన్నారు. ఇక జూనియర్ ఎన్టీఆర్ సినిమాలకు తాను థియేటర్లకు వెళ్తుంటానన్నారు. జూనియర్ ఎన్టీఆర్ ని కూడా తాను అభిమానిస్తానని, అయితే తాను సీనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్ అని చెప్పుకొచ్చారు దువ్వాడ. కార్ లో సీనియర్ ఎన్టీఆర్ పాటలు పెట్టుకుంటారని, అప్పుడప్పుడు ఆ పాటలకు అర్థాలు తనకు చెబుతుంటారని కోరస్ ఇచ్చారు మాధురి.శ్రీనివాస్ కి కూడా సినిమాలంటే బాగా ఇష్టం. ఆమధ్య మాధురి నిర్మాతగా ఆయన ఒక షార్ట్ ఫిల్మ్ లో కూడా నటించినట్టు వార్తలొచ్చాయి. నటించిన వీడియోలు కూడా బయటకొచ్చాయి. ఇక మాధురి కూడా తన యాక్టింగ్ పెర్ఫామెన్స్ ని వెండితెరపై చూపించాలనుకుంటున్నారు. ఫైనల్ గా వీరిద్దరూ హీరో హీరోయిన్లుగా నటించే అవకాశం ఉందేమోనని అనిపిస్తోంది. దువ్వాడ-మాధురి కాంబినేషన్ ఇప్పటికే బుల్లితెరపై, యూట్యూబ్ లో సూపర్ హిట్ అయింది. వీరి ప్రోగ్రామ్ లకు మంచి ప్రేక్షకాదరణ ఉంది. ఇక వీరు సినీరంగంలోకి వెళ్తే జనాల రియాక్షన్ ఎలా ఉంటుందో చూడాలి. షార్ట్ ఫిల్మ్ ల వరకు ఓకే, వెండితెరపై కనపడాలంటే అది కాస్త ఖర్చుతో కూడుకున్న పని, దానికి దువ్వాడ సిద్ధపడతారా..? మాధురి తెరంగేట్రానికి తానే నిర్మాత అవుతారా..? వేచి చూడాలి.

## బొత్సపై జనసేన ప్రత్యేక దృష్టి



**విజయవాడ, ఏప్రిల్ 2 పెన్ పవర్:** : ఏపీలో ( రాజకీయాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. ఎన్నికల్లో దారుణంగా ఓడిపోయిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని నిర్వీర్యం చేయాలని కూటమి ప్రయత్నాలు చేస్తోంది. అందులో భాగంగానే ఆ పార్టీకి కీలక నేతలు గుడ్ బై చెబుతూ వచ్చారు. పార్టీలో నెంబర్ 2 స్థాయి కలిగిన నేతలు సైతం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడారు. గత ఐదేళ్లపాటు పదవులతో పాటు ఆ పార్టీలో గౌరవం పొందిన నేతలు సైతం ఎవరి దారి వారు చూసుకుంటున్నారు. ఇప్పటికే మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు వరుసగా పార్టీకి రాజీనామా చేశారు. రాజ్యసభ సభ్యులతో పాటు ఎమ్మెల్సీలు సైతం పదవులను వదులుకున్నారు. విజయసాయిరెడ్డి లాంటి నేత వైసిపికి గుడ్ బై చెప్పడం ఆందోళన కలిగించే అంశమే. అయితే ఇప్పుడు తాజాగా బొత్స సత్యనారాయణ పై సైతం అనుమానపు చూపులు ప్రారంభమైనట్లు తెలుస్తోంది.వాస్తవానికి బొత్స సత్యనారాయణ పై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఫోకస్ పెట్టినట్లు ప్రచారం జరుగుతుంది. అందుకు అనుగుణంగా బొత్స పవన్ కళ్యాణ్ ను ఎక్కడ కలిసిన ఆప్యాయంగా పలకరిస్తున్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలకు భిన్నంగా బొత్స వ్యవహరిస్తున్నారు. అసెంబ్లీ ప్రాంగణాల్లో ఎదురుపడినప్పుడు ఆప్యాయ పలకరింతలు, ఆ లింగనాలు చేసుకుంటున్నారు. దీంతో ఏదో జరుగుతోందన్న అనుమానాలు ఉన్నాయి. అయితే తాజాగా పవన్ కళ్యాణ్ సైతం బొత్స విషయంలో పార్టీ శ్రేణులకు చర్చలు జరిపినట్లు ప్రచారం సాగుతోంది. బొత్సను పార్టీలోకి తెస్తే ఎలా ఉంటుంది అని పార్టీ శ్రేణుల అభిప్రాయాన్ని సేకరించినట్లు సమాచారం. అయితే జనసేన నాయకుల నుంచి సానుకూలత రావడంతో పవన్ నిర్ణయానికి వచ్చినట్లు ప్రచారం సాగుతోంది.

ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలపై అనేక కేసులు నమోదవుతున్నాయి. కొందరు అరెస్టులు కూడా అయ్యారు. కానీ బొత్స విషయంలో ఒక్క కేసు కూడా నమోదు కాలేదు. ఆయనకు వ్యతిరేకంగా ఎవరూ మాట్లాడడం లేదు. అయితే వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఐదేళ్ల పాటు మంత్రిగా పనిచేశారు బొత్స. కానీ ఎన్నడు రివేంజ్ రాజకీయాలు నడపలేదన్నది ఆయనపై ఉన్న మంచి ముద్ర. అందుకే కూటమి ప్రభుత్వంలో సైతం ఆయనకు సరైన గౌరవం దక్కుతోంది.ప్రస్తుతం వైయస్సార్ కాంగ్రెస్ శాసనమండలిపక్ష నేతగా ఉన్నారు బొత్స సత్యనారాయణ. పార్టీ తరఫున గట్టి వాయిస్ వినిపిస్తున్నారు. అటువంటి నేతను జనసేనలోకి తెచ్చుకుంటే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి దెబ్బతీయవచ్చని పవన్ భావిస్తున్నారట. ఉత్తరాంధ్రలో పట్టున్న నాయకుడు బొత్స. విజయనగరం జిల్లాలో అయితే నాలుగు నియోజకవర్గాలు ఆయన కుటుంబ సభ్యుల చేతిలో ఉంటాయి. మిగతా నియోజకవర్గంలో సైతం ప్రభావం చూపగలరు. ఉత్తరాంధ్రలో బలమైన తూర్పు కాపు సామాజిక వర్గంలో పట్టున్న నేత. అందుకే ఆయనను జనసేనలోకి రప్పించుకుంటే పార్టీ బలోపేతం అవుతుందని పవన్ భావిస్తున్నారట. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# వెస్టిండీస్, సౌతాఫ్రికాలతో సిరీస్.. 2025 టీమిండియా హోమ్ షెడ్యూల్, టైమింగ్ వివరాలు!





**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా క్రికెట్ ఫ్యాన్స్ ప్రస్తుతం ఐపీఎల్ చూస్తూ ఎంజాయ్ చేస్తున్నారు. ఐపీఎల్ తర్వాత 2025లో భారత క్రికెట్ జట్టు సొంతగడ్డపై ఆడబోయే క్రికెట్ షెడ్యూల్ వచ్చేసింది. బీసీసీఐ బుధవారం (ఏప్రిల్ 2) 2025-26 సీజన్ లో టీమిండియా స్వదేశంలో ఆడబోయే షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఇందులో భాగంగా వెస్టిండీస్, సౌతాఫ్రికా జట్లతో టీమిండియా స్వదేశంలో సిరీస్ ఆడనుంది. వెస్టిండీస్‌తో జరిగే టెస్ట్ సిరీస్‌తో ఇండియా హోమ్ సీజన్ ప్రారంభమవుతుంది.

వెస్టిండీస్ తో భారత్ రెండు టెస్టులు ఆడనుంది. అక్టోబర్ 2 నుంచి 6 వరకు తొలి టెస్ట్ మ్యాచ్.. అక్టోబర్ 10 నుంచి 14 వరకు రెండో టెస్ట్ జరుగుతుంది. తొలి టెస్టుకు అహ్మదాబాద్ లోని నరేంద్ర మోడీ స్టేడియం ఆతిధ్యమిస్తుంది. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ లో రెండో టెస్ట్ జరుగుతుంది. మ్యాచ్ భారత కాలమాన ప్రకారం ఉదయం 9:30 నిమిషాలకు ప్రారంభమవుతుంది.

విండీస్ తర్వాత నవంబర్- డిసెంబర్ నెలలో సౌతాఫ్రికా ఇండియాలో పర్యటిస్తుంది. మూడు ఫార్మాట్ లలో టీమిండియా.. సౌతాఫ్రికాతో తలపడనుంది. ఈ సుదీర్ఘ టూర్ లో సౌతాఫ్రికాతో రెండు టెస్టులు, మూడు వన్డేలు, ఐదు టీ20 మ్యాచ్ లు జరుగుతాయి. నవంబర్ 14 నుంచి 18 వరకు తొలి టెస్ట్ న్యూఢిల్లీ వేదికగా అరుణ్ జైట్లీ స్టేడియంలో.. నవంబర్ 22 నుంచి 26 వరకు గౌహతి వేదికగా బర్సపారా క్రికెట్ స్టేడియంలో రెండో టెస్ట్ జరుగుతుంది. నవంబర్ 30 న తొలి వన్డే.. డిసెంబర్ 3 న రెండో వన్డే.. డిసెంబర్ 6 న మూడో వన్డే జరుగుతుంది. తొలి మూడు వన్డేలకు వరుసగా రాంచీ, రాయ్‌పూర్,విశాఖపట్నం ఆతిధ్యమిస్తాయి. డిసెంబర్ 9 నుంచి డిసెంబర్ 19 వరకు మొత్తం 5 టీ 20 మ్యాచ్ లు జరుగుతాయి. డిసెంబర్ 9 న కటక్ వేదికగా తొలి టీ20.. డిసెంబర్ 11 న్యూ చండీగఢ్ వేదికగా రెండో టీ20.. డిసెంబర్ 14 న ధర్మశాల వేదికగా మూడో టీ20.. డిసెంబర్ 17 న లక్నో వేదికగా నాలుగో టీ20.. డిసెంబర్ 19న అహ్మదాబాద్ లో ఐదో టీ20 జరుగుతాయి. వన్డే మ్యాచ్ లో మధ్యాహ్నం 1:30 నిమిషాలకు.. టీ20 మ్యాచ్ లు రాత్రి 7:00 గంటలకు ప్రారంభమవుతాయి.

# కోహ్లీకి గాయం.. ముంబైతో మ్యాచ్ ఆడతాడా.. RCB హెడ్ కోచ్ ఏమన్నాడంటే..?




**హైదరాబాద్ పెన్ పవర్:** రాయల్ ఛాలెంజర్స్ మాజీ కెప్టెన్.. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ గాయపడ్డాడు. చిన్నస్వామి స్టేడియంలో బుధవారం (ఏప్రిల్ 2) గుజరాత్ టైటాన్స్ తో జరిగిన మ్యాచ్ లో కోహ్లీ ఫీల్డింగ్ చేస్తుండగా గాయమైంది. టైటాన్స్ ఇన్నింగ్స్ 12వ ఓవర్లో ఈ సంఘటన జరిగింది. ఆర్సీబీ స్పిన్నర్ కృనాల్ పాండ్యా బౌలింగ్‌లో సాయి సుదర్శన్ గట్టిగా స్వీప్ ఆడాడు. డీప్ మిడ్-వికెట్‌లో ఫీల్డింగ్ చేస్తున్న కోహ్లీ బంతిని ఆపడానికి పరిగెత్తే ప్రయత్నంలో అతని చేతి వేలికి గాయం అయింది. దీంతో గ్రౌండ్ లోనే నొప్పితో కోహ్లీ చేయి ఊపుతూ కనిపించాడు.కోహ్లీ గాయంపై అభిమానులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. అయితే అభిమానులకు గుడ్ న్యూస్ చెబుతూ.. విరాట్ గాయంపై ఆర్సీబీ హెడ్ కోచ్ క్లారిటీ ఇచ్చాడు. కోహ్లీ ప్రస్తుతం బాగానే ఉన్నాడని.. అతని ఎలాంటి సమస్య లేదని చెప్పాడు. దీంతో కింగ్ ఫ్యాన్స్ పండగ చేసుకుంటున్నారు. బెంగళూరు ఐపీఎల్ లో తమ తదుపరి మ్యాచ్ ను ఏప్రిల్ 7న ముంబై ఇండియన్స్ తో తలపడనుంది. ఈ మ్యాచ్ లో కోహ్లీ ఆడడం ఖాయమైంది. ఈ మ్యాచ్ లో కోహ్లీ 6 బంతుల్లో 7 పరుగులే చేసి ఔటయ్యాడు. స్వేర్ లెగ్‌లో షాట్‌కు యత్నించి యంగ్ బౌలర్ అర్షద్ ఖాన్ బౌలింగ్‌లో వికెట్ సమర్పించుకున్నాడు.

ఈ మ్యాచ్ విషయానికి వస్తే.. బుధవారం (ఏప్రిల్ 2) చిన్న స్వామి స్టేడియంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుపై గుజరాత్ టైటాన్స్ 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. మొదట బౌలింగ్ లో సిరాజ్ నిప్పులు చెరగగా..ఆ తర్వాత ఛేజింగ్ లో బట్లర్( 39 బంతుల్లో 73:5 ఫోర్లు, 6 సిక్సర్లు) సాయి సుదర్శన్ (49) బ్యాటింగ్ లో అదరగొట్టారు. ఈ సీజన్ లో వరుసగా రెండు విజయాలు సాధించిన ఆర్సీబీ తొలి పరాజయాన్ని మూట కట్టుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 169 పరుగులు చేసింది. లక్ష్య ఛేదనలో గుజరాత్ 17.5 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 170 పరుగులు చేసి గెలిచింది.

# నేను వన్ ఆఫ్ ది బెస్ట్ స్పిన్నర్.. చెప్పిన మాట నిలబెట్టుకున్న యువ క్రికెటర్!





**హైదరాబాద్ పెన్ పవర్:** రవిశ్రీనివాసన్ సాయి కిషోర్.. ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్ లో అదరగొడుతున్నాడు. ఆడిన మూడు మ్యాచ్ ల్లో 6 వికెట్లు పడగొట్టి ఐపీఎల్ 2025 సీజన్ ను గ్రాండ్ గా ఆరంభించాడు. బ్యాటింగ్ పిచ్ లపై రవి కిషోర్ బౌలింగ్ చేస్తున్న తీరు అద్భుతం. గుజరాత్ టైటాన్స్ తరపున ఆడుతున్న ఈ 28 ఏళ్ళ స్పిన్నర్ మూడు మ్యాచ్ ల్లో కట్టుదిట్టమైన బౌలింగ్ లో ప్రత్యర్థులను ఇబ్బంది పెట్టాడు. సహచరుడు రషీద్ ఖాన్ భారీగా పరుగులిస్తున్నా.. ఈ తమిళ నాడు స్పిన్నర్ మాత్రం తన వేరియేషన్ తో ఆకట్టుకుంటున్నాడు.

బుధవారం (ఏప్రిల్ 2) రాయల్ ఛాలెంజర్స్ తో జరుగుతున్న మ్యాచ్ లో 4 ఓవర్లలో 22 పరుగులు చేసి రెండు కీలక వికెట్లు పడగొట్టాడు. ఈ మ్యాచ్ తర్వాత సాయి కిషోర్ చెప్పిన ఒక స్టేట్ మెంట్ వైరల్ అవుతుంది. 2024 దులీప్ ట్రోఫీకి ముందు సాయి కిషోర్.. సెలక్టర్లు తనను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. "నేను దేశంలోని అత్యుత్తమ స్పిన్నర్లలో ఒకడినని భావిస్తున్నాను. నన్ను టెస్ట్ మ్యాచ్‌లకు సెలక్ట్ చేస్తే నిరూపించుకోవడానికి సిద్ధంగా ఉన్నాను. నేను ఎక్కువగా ఆందోళన చెందాల్సిన పని లేదు." అని ఈ యువ క్రికెటర్ చెప్పుకొచ్చాడు.ప్రస్తుతం బ్యాటింగ్ కు స్వర్గధామంగా ఉన్న పిచ్ లపై సాయి కిషోర్ బౌలింగ్ చేస్తున్న తీరు అద్భుతం. అతను గత సంవత్సరంలో ఇచ్చిన స్టేట్ మెంట్ కు న్యాయం చేశాడనిపిస్తుంది. గత సీజన్ లో కూడా గుజరాత్ జట్టుతోనే ఉన్న సాయి కిషోర్ 19.57 సగటుతో 5 మ్యాచ్‌లలో 7 వికెట్లు పడగొట్టి పర్వాలేదనిపించాడు. ఇదంతా పక్కన పెడితే టీమిండియాలో చోటు దక్కించుకోవడం అంత సామాన్యమైన విషయం కాదు. ముఖ్యంగా స్పిన్ విభాగంలో చాలా కష్టం. స్పిన్నర్లు ఎక్కువగా ఉండే మన దేశంలో ఎంతో అనుభవమున్న యుజ్వేంద్ర చాహల్ కు సైతం జట్టులో స్థానం దక్కడం లేదు. ఐపీఎల్ తర్వాత సాయి కిషోర్ ను సెలక్టర్లు ఏమైనా పరిగణిస్తారేమో చూడాలి.

# అద్భుతమైన లుక్స్



# జైలర్ -2! లో బాలయ్య వర్సెస్ సూర్య!





సూపర్ స్టార్ రజినీకాంత్ కథానాయకుడిగా నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వంలో - జైలర్ -2- పట్టాలెక్కిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం చెన్నైలో షూటింగ్ జరుగుతోంది. అయితే ఇందులో ఎంత మంది స్టార్ హీరోలు నటిస్తున్నారు? అన్న దానిపై ఇంకా ఎలాంటి క్లారిటీ రాలేదు.తొలి భాగంలో మోహన్ లాల్, శివరాజ్ కుమార్ లాంటి స్టార్లు గెస్ట్ అప్పియిన్స్ తో అదొరగొట్టడంతో? - జైలర్ 2- లో అంతకు మించే ఉంటుంది తప్ప తగ్గదు అనే ప్రచారం తొలి నుంచి జరుగుతూనే ఉంది. టాలీవుడ్ నుంచి నటసింహ బాలకృష్ణ పవర్ ఫుల్ పాత్రలో రంగంలోకి దిగుతున్నారని ఇప్పటికే ప్రచారంలో ఉంది. బాలయ్య మాస్ ఇమేజ్ కి ఏ మాత్రం తగ్గకుండా తెరపై కనిపించినంత సేపు విధ్వంసంలాగే పాత్ర నడుస్తుందని ప్రచారం జరిగింది. కంటున్యూటీగా మోహన్ లాల్, శివన్న పాత్రలు యధావిధిగా ఉంటాయని వినిపిస్తుంది. ఈ నేపథ్యంలో తాజాగా మరో సంచలన నటుడి పేరు తెరపైకి వస్తోంది. కోలీవుడ్ విలక్షణ నటుడు సూర్య కూడా ఇందులో ఓ కీలకపాత్ర పోషిస్తున్నట్లు ప్రచారం మొదలైంది. నెల్సన్ సూర్యతో చర్చలు జరుపుతున్నట్లు కోలీవుడ్ మీడియాలో వార్తలొస్తున్నాయి. దీనికి సంబంధించి త్వరలోనే నిర్మాణ సంస్థ నుంచి అధికారిక సమాచారం వెలువడుతుందని వినిపిస్తుంది. నిజంగా సూర్య కూడా ఎంటర్ అయితే ప్రాజెక్ట్ నెక్స్ట్ లెవల్లో ఉంటుంది. బాలయ్య ను పాజిటివ్ రోల్ లో లాంచ్ చేసి సూర్య కు పవర్ ఫుల్ నెగిటివ్ రోల్ అప్పగించి..వాళ్లిద్దరి మధ్యా మాటల యుద్ధం...భారీ యాక్షన్ సీన్ ప్లాన్ చేస్తే మామూలుగా ఉండదు. సూపర్ స్టార్ ఇమేజ్ సైతం కొట్టుకుపోయే పెర్ఫార్మెన్స్ తో అదర గొడతారు. ఆ సీన్స్ కు సూపర్ స్టార్ ఇమేజ్ టచ్ అప్ ఇస్తే నెక్స్ట్ లెవల్లో ఉంటుంది. బాలయ్య కు కోలీవుడ్ లో కూడా మాస్ ఫీల్ దక్కుతుంది. మరి నెల్సన్ ఎలాంటి వ్యూహంతో ఉన్నాడో చూడాలి.

## అనసూయ భరద్వాజ్ పూల చీర లుక్ తప్పక చూడాలి



On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com